ప్రజాశక్తి

బుధవారం 5 నవంబర్ 2025

8 పేజీలు





విశాఖపట్నం   అనకాపల్లి

అదాని సిమెంట్ ఫ్యాక్టరీ వద్దే వద్దు

◆ వాడవాడలా సిపిఎం ప్రచారోద్యమం ◆ ప్రజలను చైతన్యపరిచేందుకు జీపుజాతాలు ప్రారంభం



ఆటో జాతాల ప్రారంభ కార్యక్రమంలో జగ్గునాయుడు తదితరులు

ప్రజాశక్తి - గాజువాక : ప్రజలకు, పర్యావరణానికి తీవ్ర నష్టం చేకూర్చే అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని పెదగంట్యాడ ప్రాంతంలో ఏర్పాటు చేయొద్దని కూటమి ప్రభుత్వాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సిపిఎం రెండో దఫా ప్రచారోద్యమానికి మంగళవారం శ్రీకారం చుట్టింది. గాజువాక, మల్కాపురం, స్టీల్ జోన్ కమిటీల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఆటో జాతాలు నిర్వహించేందుకు పూనుకుంది. ఈ క్రమంలో ఆ జాతాలను మంగళవారం పాత గాజువాక జంక్షన్‌లో జెండా ఊపి జగ్గునాయుడు ప్రారంభించారు. ఈ జాతాలు తొలిరోజు గాజువాక పరిధిలోని సుందరయ్య కాలనీ, స్వతంత్ర నగర్, బానోజీతోట, చినగంట్యాడ, బీసీ రోడ్డు, ఆటోనగర్ ప్రాంతాల్లోనూ, స్టీల్ జోన్ పరిధిలోని నడుపూరు, పెదగంట్యాడ, అగనంపూడి నిర్వాసిత కాలనీలోనూ, మల్కాపురం జోన్‌లోని ములగాడ, మల్కాపురం, శ్రీహరిపురం, నెహ్రూనగర్, ఎక్స్‌సర్వీస్ మ్యాన్ కాలనీ, క్రాంతినగర్, దుర్గానగర్ తదితర చోట్ల సాగాయి. ప్రజలను చైతన్యపరిచాయి.

ఈ జాతాల ప్రారంభ కార్యక్రమంలో జగ్గునాయుడు మాట్లాడుతూ ఇప్పటికే గాజువాక ప్రాంతమంతా కాలుష్యభరితంగా మారిందన్నారు. ఇప్పుడు అదాని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే ఈ ప్రాంతం నివాసయోగ్యానికి పనికి రాకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలే సుప్రీం, ప్రజా నిర్ణయమే ఫైనల్ అని చెబుతున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఫ్యాక్టరీ రద్దయ్యేలా చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఆటో జాతాల ప్రధాన ఉద్దేశాన్ని జగ్గునాయుడు వివరించారు. లక్ష కరపత్రాలు ముద్రించి ప్రజలకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సిమెంట్ ఫ్యాక్టరీ ప్రమాదాన్ని తక్కువ చేసి చూపించేందుకు కొందరు కూటమి నేతలు అదానికి ఏజెంట్లుగా ప్రచారం చేస్తున్నారన్నారు. అదాని గంగవరం పోర్టు నిర్మాణ సమయంలో కూడా కాలుష్యం తక్కువని వారు చెప్పారన్నారు. ఇప్పుడు సింధియా మొదలుకొని గాజువాక మొత్తం గంగవరం పోర్టు మిగతా 2లో..

రైలు ప్రయాణికులకు

మెరుగైన సదుపాయాలు

◆ శ్రీకాకుళం నుంచి చర్లపల్లికి రైలు అవసరం
◆ అమృత్ భారత్ స్టేషన్లలో పనులను వేగవంతం చేయండి
◆ వాల్తేరు డివిజన్ ఎంపీల సమావేశంలో పలువురు డిమాండ్



సమావేశంలో పాల్గొన్న ఎంపీలు, రైల్వే అధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రైలు ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ కమిటీ సమావేశంలో పలువురు ఎంపీలు కోరారు. విశాఖలోని నోవాటెల్ హోటల్‌లో మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీలు రైల్వే మౌలిక సదుపాయాలు, ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచడంపై నిర్మాణాత్మక సూచనలు చేశారు. వాల్తేరు డివిజన్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను మెచ్చుకుంటూనే రైలు సేవలు, స్టాప్‌లు, ఆన్‌బోర్డు సౌకర్యాలకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు. అమృత్ భారత్ స్టేషన్ల నిర్మాణం, అరకు, కోరాపుట్, జగదల్‌పూర్, రాయగడ, శ్రీకాకుళం నుంచి వివిధ గమ్యస్థానాలకు కొత్త రైలు సర్వీసుల ప్రారంభం, చెన్నయ్, బెంగళూరు, తిరుపతి వంటి రద్దీ గమ్యస్థానాలకు రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచడం, ఇప్పటికే ఉన్న సర్వీసుల పొడిగింపు, కొత్త లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్, నాలుగో లైన్ నిర్మాణం వంటి సామర్థ్యాన్ని పెంచే ప్రాజెక్టులు, కొత్త రైల్వే అండర్ బ్రిడ్జిలు, ఓవర్ బ్రిడ్జిలు వంటి అంశాలపై మాట్లాడారు. శ్రీకాకుళం నుంచి చర్లపల్లికి నేరుగా నూతన రైలును ఏర్పాటు చేయాలని మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. నూతన రైల్వే జోన్ గెజిట్ అంశాన్ని వేగవంతం చేయాలన్నారు. అమృత్ భారత్ స్టేషన్లలో అభివృద్ధి పనులు ఆలస్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే మిగతా 2లో..

స్వల్పంగా కంపించిన భూమి

▶ వార్త మెయిన్‌లో..

కొండెక్కిన కూరగాయల ధరలు

▶ వార్త 7లో..

ఉత్సాహంగా చెకుముకి సైన్స్ పోటీలు

▶ వార్త 7లో..



అనకాపల్లి బుక్ ఫెస్టివల్‌లో కొలువుదీరిన పుస్తకాలను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

పిల్లలు పుస్తకాలు చదవడాన్ని ప్రోత్సహించాలి

శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వార్త 5లో..

ఏకలవ్య దళిత కాలనీకి శాశ్వత హక్కులు

- ఇఎఎస్.శర్మ డిమాండ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని మాధవధార ప్రాంతంలో ఉన్న సర్వే నెంబర్ 9లో ఆరు ఎకరాలకు పైగా విస్తీర్ణమున్న ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్.శర్మ స్పందించారు. ఆ భూమి విలువ వందల కోట్ల రూపాయలు ఉంటుందని, ఈ విషయంలో ప్రభుత్వం తక్షణమే దర్యాప్తు చేపట్టాలని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన కోరారు. అలాగే ఆ భూమిలో దశాబ్దాలుగా స్థిరపడిన 'ఏకలవ్య దళిత కాలనీ'ని చట్టబద్ధంగా గుర్తించి, అక్కడి ప్రజలకు శాశ్వత ఆక్రమణ హక్కులు (పట్టాలు) కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన రెవెన్యూ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నత అధికారులకు లేఖ రాశారు. స్థానిక రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కు అవడం, ఉన్నత అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్ల సర్వే నెంబర్ 9లోని భూమి అన్యాక్రాంతం అవుతోందని తెలిపారు. కొంతమంది వ్యక్తులు అక్రమంగా భూమిని ఆక్రమించుకుంటున్నారని పేర్కొన్నారు.

మార్గశిర మాసోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 21 నుంచి డిసెంబర్ 19 వరకు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం పరిధిలో జరగనున్న మార్గశిర మాసోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ప్రత్యేక ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. ప్రతి గురువారం ఎవిఎన్ కళాశాల దిగువ నుంచి వాహనాలు దారి మళ్లించాలని, శుక్ర, శనివారాల్లో టౌన్ కొత్త రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు వరకు ట్రాఫిక్ మళ్లించాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. పోలీసు శాఖ సూచనల మేరకు అవసరమైన ప్రాంతాల్లో సిసి కెమెరాలు అమర్చాలని ఆలయ అధికారులను ఆదేశించారు. నిత్యన్నదానం, ప్రసాదం కౌంటర్, క్యూలైన్ల వద్ద సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని విభాగాల అధికారులతో ఆలయ సమీపంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న దుకాణాలను మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అదాని సిమెంట్ ఫ్యాక్టరీ వద్దే వద్దు

కాలుష్యం వెదజల్లుతోందన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం, విశాఖ వెస్ట్ పరిధిలోని సింథియా నుండి జింక్ గేటు వరకుగల పది లక్షల మంది ప్రజలు నరకం చూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ గాజువాక, మల్కాపురం జోన్ కార్యదర్శులు ఎం.రాంబాబు, పి.పైడిరాజు, స్టీల్ జోన్ నాయకులు నమ్మి రమణ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో అదాని గంగవరం పోర్టు యాజమాన్యంపై చర్యలు తీసుకొని కాలుష్యాన్ని అరికడతామని ప్రస్తుత ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు హామీనిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ మాటను నిలబెట్టుకొని కాలుష్యాన్ని ఆపించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని డిమాండ్ చేశారు. అదాని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయొద్దని ప్రజలు ముక్తకంఠంతో తెలియజేశారని, ప్రజాభిప్రాయం మీద కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఫ్యాక్టరీ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎల్.బంగారు నాయుడు, ఎ.లోకేష్, యు.సోమేష్, అప్పల రెడ్డి, అదాని సిమెంట్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు ఎన్‌రామారావు, యువజన సంఘం నాయకులు కె.మహేష్, ఎన్.రాము పాల్గొన్నారు.

రైలు ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు

పార్లమెంట్ సమావేశాలలోగా స్థానిక పార్లమెంట్ సభ్యులతో కలిసి రైల్వే అధికారులు అమృత్ భారత్ ప్రతిపాదిత స్టేషన్లను సందర్శించాలని, పురోగతిపై క్షేత్ర స్థాయి పరిశీలన చెయ్యాలని కోరారు. సీనియర్ సిటిజన్లకు, స్పోర్ట్స్ పర్సన్లకు టికెట్ ఛార్జీలు తగ్గింపు కోసం ఇప్పటికే అనేక వినతులు అందాయని, సమావేశంలో కూడా ఇదే విషయం చర్చకు వచ్చిన నేపథ్యంలో తాను ప్రత్యేక చొరవ తీసుకుని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్లాట్ ఫారాల ఎత్తు పెంచే కార్యక్రమం సక్రమంగా, వేగంగా జరుగుతుండటంపై ఆనందం వ్యక్తపరిచారు. సబ్ వేలను నిర్మించే కాంట్రాక్టర్లు జవాబుదారీగా ఉండకపోవడం సరైన విధానం కాదన్నారు. వాటి నిర్మాణంలో నాణ్యతపై పలు ఆరోపణలు వస్తున్నట్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వాల్తేరు డివిజన్ అభివృద్ధి కార్యక్రమాలను, ఆర్థిక సంవత్సరంలో పనితీరును డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా వివరించారు. ఎంపీల సూచనలను పరిశీలిస్తామని తెలిపారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించిన పది మంది ఎంపీలు, వారి ప్రతినిధులు పాల్గొన్నారు. రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ సిఎం.రమేష్, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, ఎంపీలు డాక్టర్ జి.తనుజా రాణి (అరకు), కె.అప్పల నాయుడు (విజయనగరం), సప్తగిరి శంకర్ ఉలక (కోరాపుట్), మహేష్ కశ్యప్ (బస్తర్), శ్రీభరత్ (విశాఖపట్నం) ఈ సమావేశంలో పలు సూచనలు చేశారు.

మార్గశిర మాసోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

వెనక్కి జరపాలని ఆదేశించారు. ఆలయానికి వచ్చే భక్తులే స్వయంగా పాలు, పసుపు, కుంకుమ, పుష్పాలు అమ్మవారిపై వేసి అభిషేకాలు చేయటంపై వైదిక కమిటీ ఒకసారి పునరాలోచన చేయాల్సి ఉందని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పూజా సామగ్రిని భక్తుల నుంచి పూజారులు లేదా వాలంటీర్లు తీసుకొని అమ్మవారికి సమర్పించేలా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఇలా చేస్తే భక్తులకు త్వరితగతిన దర్శనాలు కల్పించడానికి వీలు కలుగుతుందన్నారు. దీనిపై పోలీసు అధికారులు కూడా ఏకాభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఇఒ కె.శోభారాణి స్పందిస్తూ వైదిక కమిటీ దృష్టిలో పెట్టి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్, ఇతర అధికారుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

దర్శనాలు ఇలా..

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా నాలుగు గురువారాలు నవంబర్ 27, డిసెంబర్ 4, 11, 18 తేదీల్లో వస్తున్నట్లు ఇఒ కె.శోభారాణి వెల్లడించారు. ఈ దినాల్లో బుధవారం తెల్లవారుజాము 2.30 గంటల నుంచే దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. సాధారణ రోజుల్లో ఉదయం 6 నుంచి 11.30, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వదర్శనం ఉంటుందని చెప్పారు. భక్తులు ఈ వేళల్లో అమ్మవారిని దర్శించుకోవాలని సూచించారు. త్రికాల సమయాల్లో అభిషేకాలు జరుగుతాయని వెల్లడించారు. విఐపిలకు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్లాట్స్ కేటాయించామని స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి జగన్నాథ స్వామి ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ ఉంటుందని, అలాగే డిసెంబర్ 18న సున్నపువీధి దిగువ నుంచి కొత్తరోడ్డు వరకూ గల రోడ్డులో మహాన్నదానం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విశిష్ట దర్శనం రూ.500, రూ.200, ప్రత్యేక దర్శనం రూ.100గా కమిటీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మార్గశిర మాసోత్సవాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక అధికారి సిహెచ్‌వి.రమణ, ఏఇఒ రాజేంద్ర, పోలీసు అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ మోసాలపై అవగాహన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు విస్తరిస్తున్న నేపథ్యంలో, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) పౌరులను 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని సంస్థ అధికారి సతీష్ తెలిపారు. మంగళవారం విశాఖలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ ఈ మోసాలు పెరుగుతున్న దృష్ట్యా, సురక్షితమైన డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి అవగాహన పెంచడం అత్యవసరం అని అన్నారు. 'డిజిటల్ అరెస్ట్' మోసంలో, సైబర్ నేరగాళ్లు పోలీస్ అధికారులుగా నటిస్తూ బాధితులను సంప్రదిస్తారని వీడియో కాల్స్ ద్వారా నకిలీ అరెస్ట్ వారెంట్‌లను చూపించి, భయాందోళనలకు గురైన బాధితులను తమ ఖాతాలకు డబ్బు బదిలీ చేయమని లేదా వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వమని మోసగాళ్లు బలవంతం చేస్తారని ఆయన తెలిపారు. అనుమానాస్పద కాల్స్ వస్తే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ (1930)కు వెంటనే రిపోర్ట్ చేయాలని అటువంటి కాల్స్, సందేశాలను , స్క్రీన్‌షాట్‌లను భద్రపరచాలని సూచించారు.

ఆటోనగర్ నిర్మాణం వెంటనే చేపట్టాలి

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్: విశాఖపట్నం ఆటోపార్ట్స్, ఆటోమొబైల్ కార్మికుల కోసం ఆటోనగర్‌ను తక్షణం నిర్మించాలని, సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు, జగదాంబజోన్ కార్యదర్శి కర్రి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం జగదాంబరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, విశాఖలో సుమారు 20 వేల మంది ఆటోపార్ట్స్, ఆటోమొబైల్ రంగాలపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారని వీరందరి కోసం ఆటోనగర్ నిర్మాణం చేస్తామని చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా గతంలో హామీ ఇచ్చారని 2018లో ఆనందపురం మండలం కమణాంలో ఆటోనగర్ నిర్మాణం కోసం 157.77 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగింద న్నారు. ఆటోనగర్ నిర్మాణానికి జిఒ ఇచ్చారని, నిధులు కూడా కేటాయించా రన్నారు. అయితే ఇప్పటి వరకూ ఆటోనగర్ నిర్మాణం జరగలేదన్నారు. రైతుల నుంచి సేకరించిన ఈ భూములకు కొంతమేర నష్ట పరిహారం చెల్లించారని, ఇంకా రూ.11 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఇటీవల రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి పి.జీభరత్ విశాఖ వచ్చిన సందర్భంలో ఆటోనగర్ నిర్మాణం చేపడతా మని చెప్పారని అయితే అది అమల్లోకి రాలేదన్నారు. ఆటోనగర్ నిర్మాణం కోసం సిఐటియు ఆధ్వర్యంలో పదేళ్లుగా పోరాటం చేస్తున్నామని, ఇప్పటికైనా ఆటోనగర్ పనులను వెంటనే ప్రారంభించాలని,కార్మికులను మోసగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని, పోరాటం చేస్తామని హెచ్చరించారు. సుందరీకరణ పేరుతో తొలగించిన బడ్డీల్లో ఆటోమొబైల్ కార్మికుల బడ్డీలు కూడా ఉన్నాయని వీరందరికీ ఉపాధి పోయిందన్నారు. తక్షణం ఆటోనగర్ నిర్మించి వీరికి ఉపాధి కల్పించాలని కోరారు. స్క్రాప్ వర్కర్స్ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: కెజిహెచ్‌లో పలు సమస్యలు ఉన్నాయని దీంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారని సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జగదాంబ జోన్ కార్యదర్శి ఎం. సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. కెజిహెచ్ ఒపి వద్ద లిఫ్ట్ కొంతకాలంగా పనిచేయటం లేదని, దీనితో రోగులను, వికలాంగులను మోసుకు వెళ్ళవలసి వస్తుందన్నారు. ఎక్స్‌రేప్లాంట్ పనిచేయకపోవడంతో పేదప్రజలు ఎంతో కష్టనష్టాలకు గురవుతు న్నారని చెప్పారు. 29 వ నెంబర్ వద్ద ఎక్స్‌రే కోసం పేషంట్లు క్యూ కట్టి గంటల కొద్ది నిరీక్షిస్తున్నారన్నారు. పిల్లలకు, రోగులకు తగిన మందులు లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కెజిహెచ్ సూపరింటెండెంట్ తక్షణమే స్పందించి లిఫ్ట్ బాగుచేయించాలని, రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందు బాటులోకి తీసుకురావాలని సుబ్బారావు కోరారు. లేని యెడల, ఈ నెల 8 న కెజిహెచ్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: ఈ నెల 14, 15వ తేదీల్లో ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరగనున్న ప్రపంచస్థాయి భాగస్వామ్య సదస్సు నిర్వహణకు అధికారులంతా సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్ మీటింగు హాలులో మంగళవారం పోలీస్ కమిషనర్ శంఖ్రబత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డిసిపిలు మేరీ ప్రశాంతి, లతామాధురి ఇతర అధికారులతో కలిసి సమీక్షించారు. ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్లపై ఆరా తీశారు. సిఐఐ అధికారులతో కలిసి జిల్లా అధికారులు సంబంధిత ఏర్పాట్లు పక్కాగా చేయాలని, సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని హితవు పలికారు. 9 వ తేదీ లోగా పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేదని, దానికి తగ్గట్లు సిఐఐ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రితో పాటు, గవర్నర్, ఉపరాష్ట్రపతి కార్యక్రమంలో భాగస్వామ్యమ య్యే అవకాశం ఉందని, అన్ని రకాల భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. లైజన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అతిథుల రాక, కార్యక్రమంలో పాల్గొనుట తదితర అంశాల్లో జాగ్రత్త వహించాలని చెప్పారు.

ఏర్పాట్ల పరిశీలన

ఎంవిపి.కాలనీ : ఈ నెల 14, 15 తేదీల్లో ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరగనున్న ప్రపంచ స్థాయి భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి మంగళవారం ఉదయం వేదిక వద్దకు వెళ్లిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసపోయిన..

బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-మధురవాడ : విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ముగడ శ్రీనివాసరావుపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. అయోధ్యనగర్ సమీపంలోని మోసం చేసిన వ్యక్తి ముగడ శ్రీనివాసరావు స్థలం వద్ద బాధితులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తానని 2021లో విశాఖ జిల్లాకు చెందిన 10 మంది యువకుల నుంచి రూ.33 లక్షలను ముగడ శ్రీనివాసరావు వసూలుచేసి తప్పించుకు తిరుగుతున్నాడని ఆరోపించారు. గత నాలుగేళ్లుగా తిరుగుతున్నా న్యాయం జరగడంలేదన్నారు. రోజువారి వడ్డీకి అప్పులు తెచ్చి ఇచ్చామని, ఇప్పుడు ఆ డబ్బులు రాక, వడ్డీ కట్టుకోలేక రోడ్డు పాలయ్యామని ఆవేదన వ్యక్తంచేశారు. ఆగస్టు 8వ తేదీ లోపు డబ్బులు పూర్తిగా ఇస్తానని, ఒకవేళ ఇవ్వలేకపోతే అయోధ్య నగరలో సర్వేనెంబర్ 91/1లో సుమారు 267 గజాలు స్థలం, బాధితులు పదిమందికి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని పోలీసుల సమక్షంలో శ్రీనివాసరావు ఒప్పంద పత్రం రాసి ఇప్పుడు తప్పించుకు తిరుగుతున్నాడని వాపోయారు. బాధితుల నిరసనకు సిపిఎం నాయకులు రాజ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. బాధితులకు వెంటనే న్యాయం చేయకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటం చేస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దిద్ది వెంకటసుబ్బారావు, బోయిన సంతోష్‌కుమార్, యండవ చంటి, జోగ హరికృష్ణ, పైలా రమణబాబు, కాకర అక్షయ్‌కుమార్, అంజూరి భాను ప్రకాష్, బురకా సంతోష్‌కుమార్, బొడ్డు వీరు అబు, బచ్చల శివసాగర్, బాధిత కుటుంబీకులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి దిబ్బల్లో జియో హెరిటేజ్ స్థలం గుర్తింపు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు ఎర్రమట్టి దిబ్బల్లో జియో హెరిటేజ్ స్థలాన్ని అధికారులు గుర్తించారు. జియో హెరిటేజ్ స్థలంలో తవ్వకాలు జరుగుతున్నట్లు గతంలో కొందరు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేసిన విషయం విదితమే. జియో హెరిటేజ్ స్థలాన్ని గుర్తించాలన్న కోర్టు ఆదేశాల మేరకు ఇటీవల మైనింగ్ శాఖ ఓ కమిటీని నియమించింది. ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న విఎంఆర్‌డిఎ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ (సర్వే సెటిల్ మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్), గనుల శాఖ నుంచి డిప్యూటీ డైరెక్టర్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నుంచి డైరెక్టర్ పి.దుర్గా ప్రసాద్, సీనియర్ జియాలజిస్ట్ శ్రీకాంత్ ఎర్ర మట్టి దిబ్బల ప్రాంతాన్ని పరిశీలించి, జియో హెరిటేజ్ స్థలాన్ని గుర్తించి హద్దులు నిర్ణయించారు. స్థానిక ఆర్‌డిఒ సంగీత్ మాథుర్, సర్వేయర్ రాజేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఎర్రమట్టి దిబ్బల్లో జియో హెరిటేజ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సంగీత్ మాథుర్, కమిటీ సభ్యులు

ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- తగరపువలస : భీమిలి మండలం అమనాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్ఎమ్ఎమ్ఎస్ పరీక్షకు సంబంధించిన మెటీరియల్‌ను మంగళవారం ఎపిటిఎఫ్ భీమిలి మండలం ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్ పి.శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి కె.సన్యాసినాయుడు, ఇ.మహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పోటీ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఈ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందని వారు చెప్పారు. స్టడీ మెటీరియల్ అందించిన దాతలకు పాఠశాల హెచ్ఎం ఎఆర్.విజయకుమారి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మనాభం బిసి కాలనీలో బోరు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని పద్మనాభం బిసి కాలనీ శివాలయం వద్ద బోరు ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. 40 కుటుంబాలు నివసిస్తున్న ఈ కాలనీలో నీటి ఇబ్బందులను గుర్తించి ఎంపిపి రాంబాబు మండల పరిషత్ నిధుల నుంచి రూ.1 లక్ష మంజూరు చేశారు. దీంతో బోరు ఏర్పాటు పనులను మంగళవారం ప్రారంభించారు.

వీధి విక్రయదారుల చట్టం అమలులో విఫలం

ప్రజాశక్తి-మధురవాడ : వీధి విక్రయదారుల చట్టం అమలులో జివిఎంసి అధికారులు విఫలమయ్యారని వీధి విక్రయదారుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావు ఆరోపించారు. మధురవాడ నగరపాలెం వెళ్లే దారిలో వీధి విక్రయదారుల యూనియన్ స్థానిక కమిటీ సమావేశం రాంపల్లి సన్యాసమ్మ, కణితి కనకమహాలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, వీధి విక్రయదారుల చట్టంలో 39 సెక్షన్లు 18 సౌకర్యాలతో కూడిన హక్కులు ఉన్నాయని తెలిపారు. పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వి.సత్యనారాయణ, రాజగిరి రమణ, ఎన్.నర్సింగరావు, జి.మహాలక్ష్మి, లలితాదేవి రమాదేవి, రేవతి కొండమ్మ, వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 10వ వార్డు పరిధి ఆదర్శనగర్ కొండవాలు ప్రాంతాల్లో వార్డు వైసిపి అధ్యక్షుడు పతివాడ కనకరాజు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి స్థానికుల నుంచి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అబ్దుల్ రావుఫ్, కనకల కృష్ణ పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి 76వ వార్డు వైసిపి అధ్యక్షులు మంత్రి శంకర్‌నారాయణ ఆధ్వర్యంలో నడుపూరులో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి గాజువాక నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయకుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆధీనంలో వైసిపి ప్రభుత్వం నిర్మించిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుకు అప్పజెప్పాలని చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి, మంత్రి రాజశేఖర్, పల్లా చినతల్లి, మార్టుపూడి పరదేశి, చిక్కా సత్యనారాయణ పాల్గొన్నారు.

మాడుగుల : మండల కేంద్రం గదబూరులో వైసిపి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. మాడుగుల మండలాధ్యక్షుడు పెదబాబు, సర్పంచ్ యడ్ల కళావతి నేతత్వంలో స్థానిక ప్రజలతో సమావేశం నిర్వహించి, ప్రభుత్వం నిర్ణయం వల్ల సాధారణ ప్రజలకు కలిగే ఇబ్బందులను వివరించారు. దీన్ని అడ్డుకునేందుకు వైసిపి పోరాటంలో భాగంగా సంతకాల సేకరణ చేపట్టి, రాష్ట్ర గవర్నర్‌కు సమర్పిస్తామని, దీనిలో ప్రజలంతా భాగం కావాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాస్,ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు యడ్ల హేమంత్, మండల యూత్ అధ్యక్షులు కుక్కర శ్రీధర్, కొట్యాడ భాస్కరరావు, వేమన గణేష్, వార్డ్ మెంబర్లు సయ్యపురెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మొబైల్ ఫోన్ దొంగల అరెస్ట్

ప్రజాశక్తి-తగరపువలస : సెల్ ఫోన్ చోరీ కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్టుచేశారు. దీనికి సంబంధించి భీమిలి పోలీసుల కథనం ప్రకారం... దివీస్ కంపెనీలో పనిచేస్తున్న మేదరమెట్ల శశికిరణ్ అక్టోబర్ 9వ తేదీన ఉదయం 5 గంటలకు ఎ షిఫ్ట్‌కు వెళ్లేందుకు చిట్టివలస జ్యూట్ మిల్లు రామాలయం మలుపు వద్ద నిలబడి సహోద్యోగి కోసం వేచి చూస్తున్నారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వచ్చి శశికిరణ్ చేతిలో ఉన్న పోకో సి16 మొబైల్ ఫోన్‌ను లాక్కున్నారు. వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించగా నిందితులు తోసివేసి పారిపోయినట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదుపై భీమునిపట్నం క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్రైమ్ ఎస్ఐ ఎస్.సూర్యప్రకాశరావు సమగ్ర దర్యాప్తు చేసి సోమవారం తగరపువలస సంతపేటకు చెందిన ఉప్పాడ మహేష్‌ను, సత్యనారాయణపేటకు చెందిన కొయ్య భరత్‌ను, చిల్లపేటకు చెందిన రిక్క శశికుమార్‌రెడ్డిని అరెస్టుచేశారు. వారి నుంచి తస్కరించిన మొబైల్ ఫోన్‌తో పాటు నేరానికి ఉపయోగించిన డియో స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.

కోల్డ్ స్టోరేజీలో పశువుల మాంసం అక్రమ నిల్వపై కేసు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ మిత్ర మెరిన్ కోల్డ్ స్టోరేజ్‌లో భారీ స్థాయిలో పశువుల మాంసం నిల్వ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోల్డ్ స్టోరేజీలో అక్రమంగా పశువుల మాంసం నిలవ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు అక్టోబర్ 2వ తేదీన విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. పశువైద్యశాఖ అధికారి డాక్టర్ అనుపల్లి అప్పారావు, ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్, పోలీసు సిబ్బందితో వెళ్లి తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలలో 1,89,737 కిలోల (సుమారు 189 టన్నులు) పశువుల మాంసం నిల్వ ఉన్నట్లు గుర్తించారు. సేకరించిన నమూనాలను హైదరాబాద్ ల్యాబ్‌కి పరీక్ష నిమిత్తం పంపారు. ఒకటి దున్నపోతు మాంసం కాగా, మిగతావి ఆవులు, ఎద్దుల మాంసంగా నిర్ధారణ అయింది. దీంతో గుంటూరు జిల్లా బాపట్లకు చెందిన కోల్డ్ స్టోరేజీ యజమాని తోటవర్తి సుబ్రమణ్యం, మేనేజర్ అబ్దుల్ గఫార్‌పై ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తిస్థాయిలో విచారణ కొనసాగుతుందని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ వాసునాయుడు తెలిపారు.

రహదారి పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ, లక్ష్మీనగర్‌లో రూ.18 లక్షలు జివిఎంసి నిధులతో జరుగుతున్న రహదారి పనులను వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సహకారంతో వార్డులో పలు కాలనీల్లో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయన్నారు. రహదారులను త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఇ భరత్, టిడిపి వార్డు మహిళా అధ్యక్షులు మజ్జి రమణి, సంజీవిరావు, శ్రీనివాసరావు, పండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాధాకృష్ణ మహోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : నియోజకవర్గ శ్రీ రాధాకృష్ణ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన స్థానిక గోకుల్ పార్కులో రాధాకృష్ణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. నియోజక వర్గ స్థాయి యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు గోకుల్ పార్కు వద్ద వేడుకల వివరాలను మంగళవారం స్థానిక విలేకర్లకు వివరించారు. ఈ వేడుకల ప్రాధాన్యతను తెలియజేస్తూ జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కరపత్రం విడుదల చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు పిన్నింటి వెంకటరమణ, జి.ఎల్లయ్య, బి.రామకృష్ణ, అక్కరమాని అవినాష్, కోరాడ రమణ, యలమంచిలి మురళి, కె.రామసూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

2వ వార్డు వైసిపి అధ్యక్షునిగా భాస్కరరెడ్డి

ప్రజాశక్తి -తగరపువలస: జివిఎంసి 2వ వార్డు వైసిపి అధ్యక్షునిగా చిల్ల భాస్కరరెడ్డిని నియమించినట్లు భీమిలి నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. రెండు రోజుల్లో వార్డు కమిటీలు కూడా వేస్తామని పేర్కొన్నారు. పదవిని అప్పగించిన శ్రీనివాసరావుకు భాస్కరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో అక్కరమాని మంగరాజు, జీరు వెంకటరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, డబ్బీరు ప్రశాంతి, చిప్పాడ వెంకటేష్, గుండసి మధు నాయుడు, తెడ్లపు అప్పలరాజు నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 44వ వార్డులో 80 అడుగుల రోడ్డు నుంచి శ్రీనివాస్ నగర్ మధ్య జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శ్రీనివాస్‌నగర్‌లో 24/7 అమృత్ పనుల కోసం తవ్విన రహదారులతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గోతుల్లో వర్షపు నీరు చేరి అంతా బురద మయంగా మారడంతో జివిఎంసి నుంచి రూ.25 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. రెండు మూడు రోజుల్లో అమృత్ పనులు పూర్తిచేసి వెంటనే తారు రోడ్డు వేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

శ్రీజ దమ్ముకు ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి-సీతమ్మధార : బిగ్ బాస్ సీజన్9లో ఐదు వారాలకుపైగా తన ఆటపాటలతో మెప్పించిన శ్రీజ దమ్మును కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. అక్కయ్యపాలెం రైతు బజార్ వద్ద సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం అభినందన సభ ఏర్పాటుచేశారు. శ్రీజ బాబాయ్‌పిన్ని గంట్ల శ్రీనుబాబు సత్యవతి దంపతులు నిర్వహించిన ఈ సభలో శ్రీజ దమ్ము మాట్లాడుతూ, తనను బిగ్ బాస్‌లో ప్రోత్సహించిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.. సాఫ్ట్ వేర్ రంగంలో ఏడాదికి రూ.25 లక్షల వేతనం పొందుతున్న తాను కేవలం బిగ్ బాస్‌పై ఫ్యాషన్‌తోనే వెళ్లినట్లు తెలిపారు. కామనర్‌గా అగ్నిపరీక్షతోపాటు అనేక ఈవెంట్‌లలో విజయం సాధించి బిగ్ బాస్ హౌస్‌లోకి అడుగు పెట్టానని చెప్పారు. ఐదు వారాలకుపైగా తాను హౌస్‌లో కొనసాగానని, ఆ సమయంలో తనకు ఎంతో మంది ఓటు వేసి మద్దతుగా నిలిచారని తెలిపారు. ఆడ పులిగా తనకు గుర్తింపు లభించిందన్నారు.. తమ కుమార్తెను ప్రోత్సహించిన వారందరికీ శ్రీజ తండ్రి దమ్ము శ్రీనివాసరావు, తల్లి లావణ్య కృతజ్ఞతలు తెలిపారు.

రమేష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డు వైసిపి సీనియర్ నాయకులు అనసూరి రమేష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌ను వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 47వ వార్డు వైసిపి అధ్యక్షులు సుకుమార్, రాఘవులు, సురేష్, జోయ్, కృపా, కనకరాజు, ఉదయ్, రాము, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గుజ్జు ధీరజ్‌కుమార్‌రెడ్డికి సత్కారం

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమితులైన గుజ్జు ధీరజ్ కుమార్‌రెడ్డిని పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కెకె.రాజు సత్కరించి అభినందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, కర్రి రామారెడ్డి, పాత్రుడు, బాలాజీ, దివాకర్ రెడ్డి, నాగరాజు, సామ్యూల్, దినేష్ రెడ్డి, రమేష్, శ్రీకాంత్, శంకర్, జయంత్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్‌టిఎస్ రహదారి ముస్తాబు

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరంలో ఈ నెల 14, 15 తేదీల్లో సిఐఐ భాగస్వామ్య సదస్సులు నిర్వహించనున్న సందర్భంగా బిఆర్‌టిఎస్ రహదారిని ముస్తాబు చేస్తున్నారు. హనుమంతువాక నుంచి అడివివరం వైపు వెళ్లే బిఆర్‌టిఎస్ రహదారి పొడువునా ఉన్న ఫుట్‌పాత్‌లు, డివైడర్లు జీబ్రా క్రాసింగ్‌లకు నలుపు, తెలుపు రంగులు అద్దుతున్నారు. దీనికోసం జివిఎంసి నిధులు సుమారు రూ.90 లక్షలు ఖర్చు చేస్తున్నారు. వీటితో పాటు దారి పొడువునా ఉన్న సుమారు 1200 విద్యుత్ దీపాలను వెలిగేలా మరమ్మత్తులు చేయిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పెదగదిలి నుంచి హనుమంతువాక వైపు వెళ్లే సర్వీసు రోడ్డులో తారు పోయి కంకర తేలిపోయి ఉంది. బిఆర్‌టిఎస్ రహదారిలో అక్కడక్కడ గుంతులు పడి ఉన్నాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రంగులతో పాటు రహదారి మరమ్మత్తులు చేయిస్తే బాగుంటుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

మొబైల్ టెక్నాలజీని అభివృద్ధికి ఉపయోగించుకోవాలి

సదస్సులో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-ఉక్కునగరం : సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతూ అందరికీ అందుబాటులోకి వచ్చిన ఈ కాలంలో సెల్ ఫోన్లు వల్ల విద్యార్థులకు ఎన్నో నష్టాలు ఉన్నాయని, వాటి పట్ల చాలా జాగ్రత్తగా ఉంటూ, అభివృద్ధికి ఉపయోగించుకోవాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. 'మన దేశం - మన రాష్ట్రం - మన ఆవిష్కరణలు' అంశంపై కెఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య కళాశాల స్టీల్ ప్లాంట్ ప్రాంగణంలో జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సెల్ ఫోన్లలో వస్తున్న అసభ్య సన్నివేశాలు, చిత్రాలు, సంభాషణల కారణంగా విద్యార్థుల మనసు చెడు వైపు దారి మళ్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై విద్యార్థులలోనూ, తల్లిదండ్రులలోనూ, సమాజం మొత్తంలో ఆలోచన, చైతన్యం రావలసిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యా రంగం చాలా అభివృద్ధి చెందిందని ఎన్నో ఉన్నతమైన కోర్సులు అందుబాటులోకి వచ్చాయని, విద్యార్థులు వారికి నచ్చిన కోర్సులు చదువుకుని అభివృద్ధిలోకి రావాలని సూచించారు. రాష్ట్రానికి గూగుల్ కంపెనీ రావటం శుభ పరిణామం అన్నారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని, రాజకీయాలలోకి కూడా రావాలని పిలుపునిచ్చారు. పరిశోధనల్లో విద్యార్థులు చూపిస్తున్న చొరవ ప్రశంసనీయమనికొనియాడారు.

కెఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ, దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థలు ఎన్నో ఉన్నాయని వాటిలో ఒక 5 సంస్థలు ఎంచుకుని వాటిలో సీట్ లభించేలా కృషి చేయాలని సూచించారు. ఐఐటిల్లో సీటు రాలేదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మన రాష్ట్రంలోఉన్న కళాశాలలు, యూనివర్సిటీల గురించి విశ్లేషించారు.


విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్నఅయ్యన్నపాత్రుడు

విద్యార్థులు అత్యుత్తమ భవిష్యత్తు కోసం ఎంచుకోవాల్సిన ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్ రఘు కుమార్, ఎజిఎం శ్రీనివాసరావు, కెఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ షణ్ముఖ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ హెచ్‌ఎస్‌ఆర్ మూర్తి, జోనల్ హెడ్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మెమెంటోలు, మెడల్స్ అందజేశారు.

ఎట్టకేలకు తాగునీరు సరఫరా

మూడు రోజులుగా నీరు లేక ఇబ్బంది పడ్డ ప్రజలు

ప్రజాశక్తి -గాజువాక : వడ్లపూడి నిర్వాసిత కాలనీకి ఎట్టకేలకు మూడు రోజుల తర్వాత మంగళవారం తాగునీరు సరఫరా అయింది. మూడు రోజులుగా వడ్లపూడి నిర్వాసిత కాలనీతో పాటు, తోకాడ, తుంగ్లాం పరిసర ప్రాంతాలకు జివిఎంసి తాగునీరు సరఫరా కాలేదు. దీంతో ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జివిఎంసి గాజువాక జోన్ అధికారులు ముందస్తు సమాచారం కూడా ఇవ్వకపోవడంతో తాగునీరు ఎప్పుడు సరఫరా అవుతుందా అని ప్రజలు ఎదురుచూశారు. నీరు మాత్రం సరఫరా కాలేదు. ప్రత్యామ్నాయంగా కనీసం ట్యాంకర్ల ద్వారా నీటిని అందించలేదు. వడ్లపూడి నిర్వాసిత కాలనీలో బోరు బావులు కూడా లేవు. వీరందరూ జివిఎంసి కుళాయిలన నీటిపై ఆధారపడి ఉన్నారు. ఆయా కాలనీల్లో ప్రజలు రోజు కూలి చేసుకొని జీవించేవారు ఎక్కువగా ఉన్నారు. నీటి కోసమని విధులకు కూడా వెళ్లకుండా ఇళ్లల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

'బుల్లయ్య'లో బెస్ట్ ఫిజిక్ ఛాంపియన్ పోటీలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎయు అంతర్ కళాశాలల బెస్ట్ ఫిజిక్ ఛాంపియన్ షిప్ పోటీలను మంగళవారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో బుల్లయ్య కళాశాల బెస్ట్ ఫిజిక్ జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. బిఎ ప్రథమ సంవత్సరం చదువుతున్న వి.జగదీష్ మిస్టర్ ఆంధ్రా యూనివర్సిటీ టైటిల్‌ను సాధించారు. పోటీల అనంతరం కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్, ఎయు స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయమోహన్, ఎయు వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి విజేతలకు పతకాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ డాక్టర్ ఆర్‌విఎల్ఎన్.రత్నాకర్, బెస్ట్ ఫిజిక్ కోచ్‌లు పాల్గొన్నారు.

కేంద్రకారాగారంలో ముగిసిన ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో ప్రారంభించిన డ్రగ్ డి అడిక్షన్ కేంద్రంలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, అకౌంటెంట్ కమ్ క్లర్క్, సైక్రియాటిస్ట్, సామాజిక కార్యకర్త, నర్సు (పురుష), వార్డ్‌బాయ్, పీర్ ఎడ్యుకేటర్ పోస్టులకు సోమ, మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూలు ముగిసాయి. రెండు రోజులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 93 మంది హాజరయ్యారు. జైళ్ల శాఖ డిఐజి ఎంఆర్.రవికిరణ్ చైర్మన్‌గా వ్యవహరించారు. రిక్రూట్‌మెంట్ బోర్డు సభ్యులుగా రాజమండ్రి పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్, విశాఖ కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎం.మహేష్‌బాబు, ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కెవి.రామిరెడ్డి, కెజిహెచ్ వైద్యులు జి.వాసవిలత, జిల్లా సబ్ జైలు అధికారి జి.వెంకటరమణ వ్యవహరించారు.

'స్కూల్ గేమ్స్'లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - యంత్రాంగం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన పలు ఆటల పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికయ్యారు.

ఆనందపురం : జిల్లా స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలలో సిర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు పాసల శ్యామసుందర్, మారిక వంశీ అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకొని రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా తరఫున ఈ నెలలో కర్నూలు జిల్లా శ్రీకాళహస్తిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. విద్యార్థులను, పీడీ బి.సత్యం మాస్టారును ప్రధానోపాధ్యాయులు శారద, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఆనందపురం హైస్కూల్ విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 14 సంవత్సరాల బాలికల విభాగంలో లహరి ప్రథమస్థానం, ఎం.ధనలక్ష్మి తృతీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 7న కర్నూలు జిల్లాలో జరగనున్నాయి. విద్యార్థులను తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులు జిఎన్.మూర్తి, వైఎఆర్‌కె.ప్రసాద్, వి.బుజ్జి, బి.వెంకటరావును ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

పద్మనాభం : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న కె.కుసుమాదేవి అండర్ 17 అథ్లెటిక్స్ డిస్కస్‌త్రో విభాగంలో విజేతగా నిలిచింది. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోఉమ్మడి జిల్లా స్థాయి ఆటల పోటీలు విశాఖపట్నం పోలీస్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గ్రేస్‌లిల్లీ మంగళవారం తెలిపారు. విద్యార్థినిని డిఇఒ ప్రేమ్‌కుమార్, ఎపిసి జె.చంద్రశేఖర్, జిసిడిఒ శ్రీదేవి, పిఇటి అభినందించారు.

ఎస్.రాయవరం : జిల్లాస్థాయి క్రీడా పోటీలలో దార్లపూడి విద్యార్థినులు పి.నాగ మౌనిక, జె.తారక లక్ష్మి బాలికల విభాగం ట్రిపుల్ జంప్ పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జాన్ మెతు షెలా తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 21 22 తేదీల్లో పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు, వ్యాయామ ఉపాధ్యాయిని నిర్మలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కె.కోటపాడు : మండలంలోని పాతవలస జిల్లా పరిషత్ హైస్కూల్ మంగళవారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యాన అండర్-14 బాల బాలికల సెలక్షన్ పోటీలు జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి కెయెం.నాయుడు సమక్షంలో జరిగాయి. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 60 మంది బాలికలు, 60 మంది బాలురు ఈ పోటీలకు హాజరు కాగా, అందులో 12 మంది బాలికలు, 12 మంది బాలురను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వి.నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు బొడ్డు కృష్ణ, స్కూల్ కమిటీ చైర్మన్ జామి ఉమాదేవి,


రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన సిర్లపాలెం విద్యార్థులు

ఎంపిటిసి వర్రి రామనాయుడు, మర్రి వలస ఎంపిటిసి కోటాను అశోక సూరిదేముడు పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని వరహాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం దొడ్డి వరహామూర్తి తెలిపారు. జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ -17 విభాగం 3వేల మీటర్లు, పరుగులో జి వసంత, రెండు వేల మీటర్లలో డి.వసంత రెండవ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్ 14 అథ్లెటిక్స్ 600, 400 మీటర్ల పరుగు పందెంలో కె జ్యోతి విజయం సాధించింది. 1500 మీటర్లలో డి లోవర్ధన్ రెండవ స్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం దొడ్డి వరహామూర్తి, పిఇటి సింహాచలం హైస్కూల్ కమిటీ చైర్మన్ మిస్కా అప్పారావు అభినందించారు.

పిల్లలు పుస్తకాలు చదవడాన్ని ప్రోత్సహించాలి

రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-అనకాపల్లి : పిల్లలు పుస్తకాలు చదివే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఏపి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న అనకాపల్లి పుస్తక మహోత్సవాన్ని ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బుక్ స్టాల్లోని పుస్తకాలను ఎంతో ఆసక్తిగా పరిశీలించి, పుస్తక ప్రదర్శనలో జరుగుతున్న అనేక కార్యక్రమాలను పరిశీలించారు. ప్రముఖుల సూక్తుల పుస్తకాలు, అబ్దుల్ కలాం లాంటి మహనీయుల పుస్తకాలు అందుబాటులో ఉండటం ఆనందదాయకమని పేర్కొన్నారు. పుస్తక మహోత్సవ నిర్వాహకుల ప్రయత్నాన్ని ఆయన ప్రశంసించారు.

కాగా అనకాపల్లి పుస్తక మహోత్సవం ఐదవ


పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న డిఎస్‌పి శ్రావణి

రోజు పాఠశాల విద్యార్థులు, పిల్లలు, తల్లిదండ్రులు, వృద్ధులు, యువత విశేష ఉత్సాహంతో పుస్తక ప్రదర్శనలో పాల్గొని నవలలు, కథా పుస్తకాలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు తదితర విభిన్న ప్రక్రియలలో పుస్తకాలు ఆసక్తిగా వీక్షించారు, కొనుగోలు చేశారు. అనంతరం జన విజ్ఞాన వేదిక నిర్వహించిన సైన్స్ ఇనిస్టాలేషన్‌లు కూడా దర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మల్ల సురేంద్ర, నూకాంబిక దేవస్థానం చైర్మన్ నాగశ్రీను (గొల్ల బాబు) తదితరులు పాల్గొన్నారు.

పుస్తక మహోత్సవాన్ని సందర్శించిన డిఎస్‌పి శ్రావణి

అనకాపల్లి ఒకటవ పుస్తక మహోత్సవాన్ని డి.ఎస్.పి శ్రావణి సందర్శించారు. మహోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఏర్పాటుచేసిన మేకులు కుర్చీ, గాజు పెంకులకుపై నడక ప్రాక్టికల్‌గా చేసి ఆనందించారు. ఆమె వెంట ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ, రూరల్ సిఐ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుకు వెలుగునిద్దాం

సాయంత్రం వడ్డాది పాపయ్య సాహిత్య వేదిక పై "తెలుగుకు వెలుగునిద్దాం" అనే అంశంపై ప్రత్యేక సమావేశం కె. రామమోహనరావు అధ్యక్షతన జరిగింది. ప్రముఖ కవులు కోరాడ అప్పలరాజు, జి.రంగబాబు, సనారా, చక్రపాణి, మల్లీశ్వరి, శిష్ట్లా తమ్మిరాజు, అమర్‌జ్యోతి, తెలుగు భాష పట్ల తమ భావాలను పంచుకున్నారు. అనంతరం లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు విన్నకోట బుచ్చిరాజు ఆధ్వర్యంలో పలు స్కిట్స్ ప్రదర్శించారు. బొడ్డేడ రాజేష్, కె శ్రీనివాసరావు, బుచ్చిరాజు ప్రదర్శించిన ఈ స్కిట్స్ ఆహూతులను అలరించాయి.

నేటి ముఖ్యమైన కార్యక్రమాలు

కాలేజ్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై, ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక సదస్సు, వ్యాసరచన పోటీ నిర్వహిస్తున్నారు. అనకాపల్లి పుస్తక మహోత్సవానికి విస్తృతంగా ప్రజలు, విద్యార్థులు, పుస్తక ప్రియులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.


సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న బాలికలు


తెలుగుకు వెలుగునిద్దాం కార్యక్రమంలో పాల్గొన్న కవులు

పుస్తకం.. ఒక స్నేహితుడు

- విజ్ఞానాన్ని పెంపొందించే అస్త్రం
- పుస్తక ప్రదర్శన పట్ల పలువురు హర్షం
- మళ్లీ మళ్లీ పెట్టాలని విజ్ఞప్తి
- ప్రభుత్వ సహకారం ఉండాలంటున్న పుస్తక ప్రేమికులు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

అనకాపల్లి ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అనకాపల్లి 1వ పుస్తక మహోత్సవం పట్ల పలువురు హర్షం చేస్తున్నారు. ఆధునిక సాంకేతిక యుగంలో పుస్తకాల పట్ల ఆసక్తి తగ్గిపోతున్న వేళ ఇలాంటి ప్రదర్శన సమాజానికి మేలు చేస్తాయని, పఠన సంస్కృతిని పెంపొందించేందుకు దోహదపడతాయని పుస్తక ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. పుస్తకం ఒక స్నేహితుడులా మనసుకు ప్రశాంతినిస్తుందే గానీ, మోసం చేయదనే భావన వెలిబుచ్చారు. సోషల్ మీడియా, మొబైల్ ఫోన్ల వలన యువత చదువులో ఏకాగ్రత కోల్పోతున్నారని, విజ్ఞాన ఆర్జన తగ్గిపోతున్నదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతిక ప్రపంచంలో పుస్తకాల పరిచయం తక్కువ అవడం వలన విద్యార్థులు లోతైన ఆలోచన చేయడంలో వెనుకబడుతున్నారని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. పుస్తకాలు చదవడం ద్వారా మనసుకు ప్రశాంతత, విజ్ఞానం, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఇలాంటి పుస్తక ప్రదర్శనలు భవిష్యత్తులో తరచుగా జరగాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. పిల్లల్లో పఠన అలవాటు పెంచడానికి ఇది మంచి వేదికన్నారు. పుస్తక ప్రేమికులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుస్తకాలను కొనుగోలు చేయడం గమనార్హం. పుస్తకాల పట్ల ఆసక్తి మళ్లీ పునరుద్ధరించబడినట్లు ఈ మహోత్సవం ద్వారా స్పష్టమైంది.

ప్రభుత్వం సహకరించాలి



పుస్తకం చేసిన మేలు ఎవరూ చేయరు. అలాంటి పుస్తక పఠనం సాంకేతిక ప్రపంచంలో దూరమవుతుంది. విద్యార్థులు కూడా పుస్తక విలువ తెలుసుకోలేకపోతున్నారు. ఇంటర్నెట్ మొబైల్ వంటివి ఉపయోగించి అనారోగ్యానికి గురవుతున్నారు. పుస్తక ప్రదర్శన వంటి వాటికి ప్రభుత్వ సహకారం కూడా ఉండాలి.

- ఎస్.తమ్మిరాజు, విశ్రాంత ఉపాధ్యాయులు

చాలా ఆనందంగా ఉంది



పుస్తక ప్రదర్శనలు చూస్తే ఏదో పండగలో పాల్గొన్నట్లు అనిపించింది. అన్ని రకాల పుస్తకాలు ఒకే చోట ఉండడం ఆనందంగా ఉంది. పుస్తకంతో విజ్ఞానం మానసిక బలం అన్ని లభిస్తాయి. ఇలాంటివి మళ్లీ మళ్లీ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- ఎం.ప్రకాష్‌రావు, విశ్రాంత ఉద్యోగి

ప్రతి జిల్లాలో పుస్తక ప్రదర్శన



అన్ని రకాల పుస్తకాలను ఒకే చోట ప్రదర్శించడం అనేది అందరి సహకారంతో చేస్తున్నాం. లక్ష టైటిల్స్‌తో కూడిన అనేకమంది గ్రంథకర్తల పుస్తకాలను అందుబాటులో ఉంచాం. రాష్ట్ర సాంస్కృతిక శాఖ గ్రంథాలయ సహకారం కూడా తీసుకుంటున్నాం. ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసే విధంగా ప్రణాళికలు చేశాం.

కె.లక్ష్మయ్య, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు

రాష్ట్రస్థాయి స్టూడెంట్ అసెంబ్లీకి ఎంపిక

ప్రజాశక్తి -నక్కపల్లి : ఈనెల 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో జరగనున్న విద్యార్థి శాసనసభ కార్యక్రమానికి నక్కపల్లి బాలుర ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థి చంద్రగిరి రేణుకా దేవి ఎంపికైనట్లు చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వి. బాలాజీ తెలిపారు. చినదొడ్డిగల్లు పాఠశాలలో మంగళవారం పాయకరావుపేట నియోజకవర్గ స్థాయిలో రాజ్యాంగ దినోత్సవ పోటీలు నిర్వహించారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్ రాయవరం, కోటవురట్ల మండల స్థాయి పోటీల్లో ఎంపికైన 12 మంది విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించగా, ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు క్విజ్ పోటీలను పర్యవేక్షించారు. నక్కపల్లి విద్యార్థిని చంద్రగిరి రేణుకా దేవి ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం బాలాజీ తెలిపారు. అమరావతిలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే 175 మందిలో ఒకరిగా ఎంపికైన రేణుకా దేవిని ఉపాధ్యాయులు నాగ శివరామ్, మణి అభినందించారు.

దేవరాపల్లి : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న అమరావతి అసెంబ్లీలో జరిగే మాక్ (మోడల్) అసెంబ్లీ పోటీలకు విద్యార్థి శాసన సభ్యురాలిగా మండలంలోని కాశీపురం జెడ్‌పి హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి సింగంపల్లి వెంకట సాయి మేఘన ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం రాజేష్ సుజాత తెలిపారు. మాడుగుల నియోజకవర్గ స్థాయిలో సుమారు 50 జెడ్‌పి హైస్కూళ్ల విద్యార్థులకు నిర్వహించిన ఉపన్యాస, క్విజ్ పోటీలలో వెంకట సాయి మేఘన మేకింగ్ ఇండియా వికసిత్ ఆంధ్ర ప్రదేశ్, భారత రాజ్యాంగ ఆవశ్యకత, పౌరుల హక్కులు బాధ్యతలు తదితర అంశాలపై ఆంగ్ల భాషలో అనర్గళంగా ప్రసంగించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈ మేరకు ఆమె మాక్ అసెంబ్లీలో అధ్యక్షా... అంటూ తన వాణి వినిపించనుందని హెచ్‌ఎం పేర్కొన్నారు. ఈ మేరకు వెంకటసాయి మేఘనను, ఆమె గైడ్ టీచర్ కొట్నాన రాంబాబును ఎంఇఒలు ఉమా, ఉషారాణి, ఉప సర్పంచ్ ఆదిరెడ్డి సింహాచలం నాయుడు, ఎంపిటిసి వంటాకు పైడితల్లమ్మ, పేరెంట్స్ కమిటీ చైర్ పర్సన్ ఆదిరెడ్డి వరలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆనందపురం: భీమిలి నియోజకవర్గంలోని పద్మనాభం, చినగదిలి, ఆనందపురం మండలాలతో కలిసిన ప్రాంతంలో నిర్వహించిన స్టూడెంట్ అసెంబ్లీ ఎంపిక కార్యక్రమంలో బోయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బూస అక్షయ (9వ తరగతి) ఎంపికైంది. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబర్ 26న జరగబోయే రాష్ట్రస్థాయి విద్యార్థి అసెంబ్లీలో పాల్గొనే 175 మంది విద్యార్థులలో అక్షయ ఒకరిగా ఎంపిక కావడం గర్వకారణమని గ్రామ సర్పంచ్ వానపల్లి లక్ష్మి, ముత్యాలరావు, ఎస్ఎంసి చైర్మన్ చిల్ల రామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐవి.కొండబాబు, గైడ్ టీచర్ పి.అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉప కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఎన్నో సంవత్సరాలుగా వోల్టేజ్ సమస్యలతో ఇబ్బందులు ప్రజలకు చెక్ పెట్టేందుకు మండలంలోని చౌడువాడలో ఏర్పాటు చేసిన విద్యుత్ ఉప కేంద్రాన్ని బుధవారం రాష్ట్ర విద్యుత్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్నారు. చౌడువాడ, గరుగుబిల్లి, మల్లంపాలెం, పైడమ్మపేట, పాలిలవానిపాలెం, గుల్లేపల్లి, చోడవరం మండలం రాయపురాజుపేట, సీమునాపల్లి, నరసాపురం గ్రామాలకు విద్యుత్ లో వోల్టేజీ సమస్యలు తీరనున్నాయి. గత టిడిపి ప్రభుత్వంలో చౌడువాడ విద్యుత్ ఉపకేంద్రానికి రూ.2.50 కోట్లు మంజూరు చేసింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం దీన్ని పక్కన పెట్టేసింది. అప్పటినుండి చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు అధికారులు చుట్టూ ఎన్నో ప్రదక్షిణలు చేసిన ఫలితం కనిపించలేదు. ప్రస్తుతం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఈ సమస్యను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏపిఈపిడిసిఎల్ అధికారుల సహకారంతో రూ.3.70 కోట్లు మంజూరు చేయించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-చోడవరం : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ వైద్యులు పి.శకుంతలరావు అన్నారు. మత్తు వదులుదాం - మంచి సమాజం కోసం పోరాడుదాం అనే అంశంపై పిడిఎస్‌ఓ ఆధ్వర్యంలో చోడవరం వెంకటేశ్వర కళ్యాణమండపం మంగళవారం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి, యువతను తప్పు దోవ పట్టిస్తున్న సమాజ వినాశనానికి కారణమవుతున్న మద్యం, మత్తు పదార్థాలు, గంజాయి, అశ్లీల సినిమాలు, వెబ్ సిరీస్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. పిడిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నందవరపు భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.సురేష్ నాయకులు గౌరీ శంకర్, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ ఓ.లక్ష్మీ కుమారి, కే.వరహాల నాయుడు, ఎన్‌వైఎస్ నాయకులు పి.రమేష్, వై. రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : కె.కోటపాడు అయ్యన్న జూనియర్, డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు జోగన్నపాలెం, కింతాడ గ్రామాల్లో ప్రారంభించిన ప్రత్యేక శిబిరం నాలుగవ రోజు మంగళవారం కూడా కొనసాగింది. ఎన్ఎస్ఎస్ పీఓ సీముసురు రమణ ఆధ్వర్యంలో కింతాడ సమీపంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా వాలంటీర్స్ తుప్పలను తొలగించారు. జోగన్నపాలెంలో జూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్ పీఓ గాడి అప్పారావు ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కన్నూరు సూర్య నారాయణ, వెటర్నరీ అసిస్టెంట్ శ్రీనివాసరావు, అధ్యాపకులు సుశీల, దుర్గాదేవి, కళ్యాణి, దీప్తి పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇ ఎగుమతి సదస్సును వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విభాగం (ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ) ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీలలో విశాఖపట్నం మేరియట్ హోటల్‌లో ఏపీ ఎంఎస్ఎంఈ ఎగుమతి సదస్సు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. ఈ సదస్సులో ఇంజినీరింగ్ గూడ్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ కంపోనెంట్స్, డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్, టెక్స్టైల్ అండ్ అపారెల్, ఆటోమొబైల్స్ అండ్ ఆటో కంపోనెంట్స్, అగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్, కెమికల్స్ అండ్ కెమికల్ ప్రొడక్ట్స్, మెరైన్ ప్రొడక్ట్స్ తదితర రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. జపాన్, శ్రీలంక, రష్యా, న్యూజిలాండ్, జింబాబ్వే, ఉగాండా, హంగేరీ, కోస్టారికా తదితర దేశాల నుండి వస్తువులు కొనుగోలుదారులు ఈ సదస్సులో పాల్గొననున్నారని తెలిపారు. ఈ సదవకాశాన్ని జిల్లాలో గల పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని, తమ ఉత్పత్తులను ప్రదర్శించి విదేశీ మార్కెట్‌లో విస్తరించుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. నమోదు లింక్ కొరకు : https://indiasmeforum.org/itd/vizag-nov-2025 చూడవచ్చుని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : మండలంలోని తుమ్మపాల, బౌలువాడ, తగరంపూడి, మెట్టపాలెం గ్రామాలలో అనారోగ్యంతో, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న బాధితులు 12 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.11.38 లక్షల చెక్కులను అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చిన్నారులకు పట్టాలు అందజేసిన యాజమాన్యం

శ్రీప్రకాష్‌లో యుకెజి విద్యార్థుల స్నాతకోత్సవం

ప్రజాశక్తి-పాయకరావుపేట : స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థలో 2024-25 విద్యా సంవత్సరం పెద్ద బాలవనం (యు.కె.జి) విద్యార్థులకు స్నాతకోత్సవాన్ని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన పట్టాలు అందించారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో ప్రతిరోజు కొంత సమయాన్ని ఆట పాటలతో, కథలు చెప్తూ గడపాలని సూచించారు. భారత్ వికాస్ పరిషత్ సౌత్ జోన్ బృందగాన పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులను శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రజరర్ చిట్టూరి రామసీత ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్ మూర్తి, అకడమిక్ ఇంచార్జిలు బి.ప్రసూన మౌళి, ఉషారాణి, భార్గవి, సునీత, డిఎల్‌పి రాజు పాల్గొన్నారు.

ఉపాధి హామీ గ్రామసభ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలో గుడివాడ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2026-27 సంవత్సరానికి గాను రూ.26 కోట్ల బడ్జెట్‌తో ప్లానింగ్ గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మీనా కుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి వంద రోజులు పని ఇచ్చి రూ.30వేలు వరకు ప్రతి ఆదాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దూళి శ్రీను, మాజీ సర్పంచ్ వెంకటరాజు, పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

పిజిఆర్‌ఎస్ ఫిర్యాదులపై విచారణ

ప్రజాశక్తి-కోటవురట్ల : పిజిఆర్‌ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులపై మండలంలోని కైలాస పట్నం, జగ్గంపేట గ్రామాలలో అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. పూర్తి విచారణ అనంతరం చర్యలు చేపడతామని తహాశీల్దార్ తిరుమలబాబు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మణికంఠ, వీఆర్వో రామకృష్ణ, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని పెట్టుగోళ్ళపల్లి, చినగుమ్ములూరు, ఎస్.రాయవరం గ్రామ పంచాయతీల పరిధిలో సూపర్ శానిటేషన్ కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. వీటిని డిప్యూటీ ఎంపీడీవో బంగారు సత్యనారాయణ పరిశీలించారు. తెలిపారు. పెట్టు గోళ్ళపల్లి గ్రామంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోతున్న పిచ్చి మొక్కలను తొలగించే పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు సురేష్ కుమార్, రమేష్ బాబు, నాయకులు అల్లు నరసింహమూర్తి పాల్గొన్నారు.

తాచేరు కాజ్‌వేకు మరమ్మతులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని తాచేరు కాజ్‌వే మరమ్మతు పనులను మంగళవారం చేపట్టారు. నెల రోజుల క్రితం కాజ్వేవేకు మరమ్మతులు పూర్తి చేసి వాహనాల రాకపోకలకు ఏర్పాట్లు చేశారు. అయితే గత వారంలో కురిసిన భారీ వర్షాలకు ఈ కాజ్వే మళ్ళీ కొట్టుకుపోయింది. ఇప్పుడు తాచేరుకు వచ్చే నీరు తగ్గడంతో మంగళవారం పనులను ప్రారంభించారు. గతంలో వేసిన గొట్టాలను సరిచేస్తూ కంకర మట్టితో రాకపోకలు కనుగునంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కాజ్‌వే కొట్టుకుపోవడంతో వడ్డాది- చోడవరం మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, చోడవరంలోని పలు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాజ్వే మరమ్మతులు పూర్తయితే రాకపోకలకు ఇబ్బందులు తగ్గుతాయి.



కాజ్‌వే మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

కార్తీక పౌర్ణమి సందర్భంగా

దేవాలయాలు, స్నానఘట్టాలలో భద్రతా ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం శివాలయాలు, ప్రముఖదేవాలయాలు, స్నానఘట్టాలు, ప్రయివేటు వ్యక్తులు నిర్వహిస్తున్న దేవాలయాలలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయం నుండి రెవిన్యూ, దేవాదాయశాఖ, పోలీసు, వైద్యశాఖ, ఎంపిడిఒలతో దేవాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లపై మంగళవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేవాలయాలలో ప్రజల సంఖ్యకు అనుగుణంగా క్యూలైన్లకు బారికేడ్లు, మంచినీరు, మరుగుదొడ్లు, పార్కింగు, విద్యుత్ సదుపాయం తదితర సదుపాయాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. సముద్ర, నదీ స్నానఘట్టాల వద్ద గజఈతగాళ్లను, బోట్లను సిద్ధంచేసుకోవాలని, మహిళలు బట్టలు మార్చుకొనుటకు సదుపాయం ఏర్పాటు చేయాలని కోరారు. రాంబిల్లి మండలం పంచదార్ల, కశింకోట మండలం సత్యనారాయణ స్వామి వార్ల గిరిప్రదక్షణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ దేవాలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సుబ్బలక్ష్మి, ఆర్‌డిఒలు, జిల్లా ఎండోమెంటు అధికారి కెఎల్.సుధారాణి, గ్రామ వార్డు సచివాలయాల అధికారి మంజులవాణి, తహాశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

జలపాతాన్ని తలపిస్తున్న ఫ్లైఓవర్

ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : జాతీయ రహదారి - 16 నిమిత్తం అనకాపల్లి శివారులో నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జి వర్షం పడితే జలపాతాన్ని తలపిస్తోంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ వంతెనపై పేరుకున్న నీరు నేరుగా కింద రోడ్డుపై పడిపోతోంది. జలపాతంలా పై నుండి కిందకు వర్షపు నీరు పడుతుండడంతో వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రహదారిపై ప్రయాణిస్తున్న వారి తలపై, దుస్తులపై బురద నీరు పడుతోంది. కొంతమంది ద్విచక్ర వాహనదారులు ఆ నీటి నుండి తప్పించుకునే ప్రయత్నంలో ప్రమాదాలు కూడా చోటు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇంత పెద్ద వంతెన నిర్మించేటప్పుడు నీటి పారుదల సదుపాయాలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ లోపం వలన రహదారి మీదే జలపాతం ఏర్పడుతోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిని నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



ఫ్లై ఓవర్ బ్రిడ్జి పై నుండి కింద రోడ్డుపై పడుతున్న వర్షపు నీరు

మురికి కాలువ వద్ద కుళాయి తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందించిన అధికారులు



కుళాయిని తొలగించి బ్లీచింగ్ జల్లుతున్న దృశ్యం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : 'మురుగు మధ్య మంచినీలి కుళాయి' శీర్షికన సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. మండల కేంద్రంలో గొల్లవీధిలో మురికి కాలువ పక్కన కుళాయి ఏర్పాటు చేయడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఎన్నిసార్లు అధికారులకు తెలిపినా పంటిచుకోకపోవడంతో ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురించడం జరిగింది. దీంతో డిప్యూటీ ఎంపీడీవో బంగారు సత్యనారాయణ దగ్గర ఉంది పంచాయతీ సిబ్బందితో ఈ కుళాయిని తొలిగించి పక్కకు మార్పించారు. దీనిపై స్థానికుల హర్షం వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి కె.చంద్రశేఖర్ దేవ్ ఆదేశించారు. దేవరాపల్లి పీహెచ్సీలో మంగళవారం జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల విస్తారంగా వర్షాలు కురిసినందున మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా తగు చర్యలు తీసుకునే విధంగా ప్రజలకు వివరించాలని సూచించారు. ఆయన వెంట పీహెచ్సీ వైద్యాధికారి ఈ.పూజ్యమేఘన, హెల్త్ సూపర్వైజర్ కె.పుష్పరాజ్ ఉన్నారు.

సకాలంలో వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-పరవాడ : రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఎన్‌సిడి, ఆర్‌బిఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్తేరురాణి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు.క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రాముఖ్యతను వివరించి, ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలకు సూచించారు. హైరిస్క్ గర్భిణీ స్త్రీలను తక్షణమే ఉన్నత వైద్య సేవలు అందించే ఆసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ జయశ్రీ, కరిష్మా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్ఎస్ సాయి రామ్, పిహెచ్ఎన్ జానకీరామన్, సూపర్వైజర్ ఎంఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

మరిడిమాంబ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం గ్రామంలోఈ నెల 6వ తేదీన జరగనున్న శ్రీమరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం వాల్ పోస్టర్‌ను మంగళవారం స్థానిక నాయకులతో కలిసి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెన్నెల ఏకుల అప్పారావు, వెన్నెల అప్పలనాయుడు, వెన్నెల వెంకినాయుడు, మాజీ ఎంపీటీసీ పైల రతాల సన్యాసిరావు, ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, వెన్నెల నరసింహారావు, పైల జూనియర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శకుంతలదేవి 104వ జయంతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మానవ గణన యంత్రంగా పేరుగాంచిన శకుంతల దేవి 104వ జయంతి వేడుకలు మండలంలోని దిబ్బడి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శకుంతల దేవి జీవిత చరిత్ర, వేద గణితం మీద క్విజ్ నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం కేతిరెడ్డి సత్యారావు చేతుల మీద బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఏవిఎన్ మూర్తి, శివజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

7న హాకీ శత దినోత్సవం

ప్రజాశక్తి - యలమంచిలి, యలమంచిలి టౌన్ : దేశంలో హాకీ క్రీడ ప్రారంభమై ఈ నెల 7వ తేదీ నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో జిల్లా శత దినోత్సవ వేడుకలకు యలమంచిలి వేదిక కానుందని జిల్లా అసోసియేషన్ కన్వీనర్ కొఠారు నరేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ క్రీడకు ప్రచారం, పోటీలు నిర్వహించడానికి జిల్లా హాకీ అసోసియేషన్ పూనుకొందని పేర్కొన్నారు. దీనికి యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 7న జిల్లాలోని బాలురు, బాలికల హాకీ జట్లను ఎంపిక చేసి పోటీలు నిర్వహించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. హాకీ సూపర్ సీనియర్లను గుర్తించి వారిని గౌరవించడం జరుగుతుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు వృత్తి నైపుణ్య పోటీలు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం, వడ్డాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 9, 10 తరగతుల విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్లో భాగంగా ఎలక్ట్రానిక్స్ అభ్యసిస్తున్న వారికి మంగళవారం వృత్తి నైపుణ్య పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్టులు చేశారు. వాటిని స్కూల్ లెవెల్లో ప్రదర్శించారు. విద్యార్థులకు హెచ్‌ఎమ్ పి.ప్రసన్న కళ బహుమతులు అందించారు. ఇలాంటి పోటీలు విద్యార్థులకు వృత్తి విద్యలో నైపుణ్యాలను ప్రదర్శించడానికి, మెరుగుపరచుకోవడానికి దోహద పడతాయని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయులు కె.గంగాధర, పి.అప్పారావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రన్ ఫర్ యూనిటీ ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా "సర్దార్‌ఏ150-ఏక్తా యాత్ర" రన్ ఫర్ యూనిటీ ర్యాలీని అనకాపల్లి పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. శారదా నది బ్రిడ్జి నుండి సూర్యనారాయణ స్వామి మందిరం వరకు సాగిన ఈ ర్యాలీకి ఎంపీ డాక్టర్ సీఎం రమేష్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, రాష్ట్ర అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి నేత దాడి రత్నాకర్, కోట్ని బాలాజీ, సురేంద్ర, మోహన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి-సబ్బవరం : గుంతలు పడిన అసకపల్లి - లంకెలపాలెం వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డును మంగళవారం ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ విజయశ్రీ పరిశీలించారు. మొంథా తుపాను కారణంగా ఈ రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరి రహదారి చెరువును తలపిస్తోంది. ఏడేళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నది. దీంతో ఫార్మాసిటీకి, ఎన్టీపీసీకి వెళ్లే ఉద్యోగులు, సుమారు పది గ్రామాల ప్రజలు ఈ మార్గం ద్వారా ప్రయాణం సాగించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుంతల కారణంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆదేశాల మేరకు ఈ రోడ్డును ఆర్ అండ్ బి అధికారి పరిశీలించారు. కార్యక్రమంలో పైడివాడ అగ్రహారం ఎంపీటీసీ సీరం అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గి నాయుడు, స్థానిక నాయకులు కోన సత్యనారాయణ, అక్కిరెడ్డి అచ్చిబాబు, కోన శివరామ ప్రసాదు, పాల్గొన్నారు.



గుంతల రోడ్డును పరిశీలించిన ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్

కొండెక్కిన కూరగాయల ధరలు

• కొబ్బరి కాయలు, పూలు, పండ్లు, పూజా సామగ్రిదీ అదే పరిస్థితి



దుకాణంలోని కూరగాయలు

ప్రజాశక్తి-నర్సీపట్నం/కోటవురట్ల : మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు ఉద్యాన పంటలకు తీవ్రనష్టం వాటిల్లడంతో మార్కెట్లో కూరగాయ ధరలు మండిపోతున్నాయి. సామాన్యులు కూరగాయలు కొనుక్కు తినలేని పరిస్థితి ఉంది. మార్కెట్లో బీర, బెండ, దొండ, వంగ, వంటి కూరగాయల ధరలు కిలో రూ.40 నుంచి అమాతం రూ. 80 వరకు పెరిగిపోయాయి, తుపాను ముందు వరకు టమోటా రూ.30 రూపాయలు ఉండగా ఇప్పుడు రూ.60 పలుకుతుంది, చిక్కుళ్ళు ఏకంగా రూ.80లకు ఎగబాకాయి. అల్లం, పచ్చిమిర్చి, ధరలు కూడా రెట్టింపునకు మించిపోయాయి. ఆకుకూరలు పరిస్థితి ఇక చెప్పలేం. క్యాప్సికమ్, బీట్‌రూట్, క్యారెట్ వంటి కూరగాయాలు కూడా అమాంతం పెరిగిపోయాయి. ఒకవైపు తుపాన్ దెబ్బకు పంటలకు తీవ్రంగా నష్టం వాటిలడం, మరోవైపు కార్తీకమాసం కావడంతో నెలరోజులపాటు హిందూ భక్తులంతా మాంసాహారానికి దూరంగా ఉండి, కేవలం కాయగూరలే తినే పరిస్థితి ఉండడం, దీనికితోడు అయ్యప్ప, శివ, భవానీ, ఇతర మాలాధారణ భక్తులు సైతం కాయగూరలనే తినడంతో ఒక్కసారిగా వీటి డిమాండ్ పెరిగి, ధరలు రెట్టింపును దాటిపోయాయి. ధరలు రెట్టింపును మించిపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలంతా కూరగాయలను కొనుక్కుని తెచ్చుకునే పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదు.

కొండెక్కిన కొబ్బరికాయ పూల ధరలకూ రెక్కలు

ఇదిలా ఉంటే కార్తీకమాసం పూజల సీజన్ కావడంతో పూజా సామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. కొబ్బరికాయ ధరలు కొండెక్కి కూర్చోగా, తుపాన్, వర్షాల దెబ్బకు పంటలు నష్టపోయిన అరటిపళ్ళ, పూల ధరలను ఊహించుకోవడం కష్టమే. ఒకపుడు సైజును బట్టి రూ.20నుంచి 35లోపే దొరికే కొబ్బరి కాయలు ఇపుడు ఏకంగా రూ.50 దాటేశాయి. ఇక కాస్తంత సైజు పెద్దది ఉంటే రూ.80పైమాటే. బంతి చామంతి పువ్వులు ధరలు సైతం అమాంతం పెరిగిపోయాయి. ధరలు కొండెక్కి కూర్చున్నా, భక్తులు మాత్రం కొబ్బరికాయలు, అరటిపళ్ళ, పూలు, ఇతర పూజాసామగ్రి కొనుగోళ్ల విషయంలో వెనక్కుతగ్గడం లేదనే చెప్పాలి.



మార్కెట్లో అమ్మకానికి కొబ్బరికాయలు

దళారులకే అధికంగా లాభం

కూరగాయలు, పూజాసామగ్రి ధరలు విపరీతంగా పెరిగినా, ఇటు పండించిన రైతుకుగానీ, చివరగా అమ్ముకునే వ్యాపారులకు గానీ అంతగాఒరిగిందేమీ లేదని పలువురు అంటున్నారు. రైతు నుంచి వ్యాపారి ద్వారా వినియోగదారునికి చేరేలోగా, మధ్యలో అనేక చేతులు మారుతూ మధ్య దళారీలే దీని ద్వారా ప్రయోజనం పొందుతున్నారని అంటున్నారు. కొబ్బరి కాయలు ధరలకు రెట్టింపునకు మించిపోయి పెరిగినా తమ వద్ద నుంచి రూ.20 నుంచి రూ.30లోపే కొంటున్నారని, మార్కెట్‌లో రూ.60 నుంచి రూ.80 వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని కొబ్బరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండ్లు, పూల రైతులదీ అదే పరిస్థితి అని వాపోతున్నారు. మొత్తానికి ప్రస్తుతం కార్తీకసీజన్‌లో పండ్లు, కూరగాయలు, పూల ధరలు మాత్రం ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.

ప్రాణాంతకంగా బురద రోడ్డు

• నల్లరాయి క్వారీ భారీ వాహనాలతో ధ్వంసం

• బురద తొలగించి, బాగుచేయాలని గిరిజనం ధర్నా

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని అర్ల, శరభవరం పంచాయతీ రాజన్నపేట నుండి అర్ల వెళ్లే రహదారిలో బోడుమెట్ట వద్ద బురద, ఊబి తొలగించాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బురదలో దీక్ష నిర్వహించారు. శరభవరం పంచాయతీ వడ్డిప నుండి రాజన్నపేట, గదబపాలెం, గుర్రాలబయలు తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే వడ్డిప నుండి అర్ల వరకు పిఎంజిఎస్‌వై కింద తారు రోడ్డు నిర్మాణం చేశారు. రాజన్నపేట బోడిమెట్ట నల్లరాయి క్వారీ వరకు కొత్త రోడ్డు వేశారు. అయితే ఈ రహదారి బురదమయం కావడంతో రాకపోకలకు ప్రాణాంతకంగా మారిందని, రాత్రి వేళల్లో బైక్‌లపై వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టి తారు రోడ్లు వేసినా, నల్లరాయి క్వారీ భారీ వాహనాలతో అవన్నీ పాడై, ప్రాణాంతకంగా తయారయ్యాయని ఆవేదన చెందుతున్నారు. వెంటనే రోడ్లు బాగుచేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, గిరిజన సంఘం నాయకులు నీలపు శ్రీను, చిన్ని రమణ డిమాండ్ చేశారు.



బురదలో దిగి నిరసన వ్యక్తం చేస్తున్న గోవిందరావు, తదితరులు

ఉత్సాహంగా చెకుముకి సైన్స్ పోటీలు



మాడుగులలో ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న హెచ్‌ఎం, తదితరులు

ప్రజాశక్తి-నర్సీపట్నం: జన విజ్ఞాన వేదిక సైన్సుసంబరాల్లో భాగంగా నర్సీపట్నం బాలికోన్నత పాఠశాలలో చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 72 మంది విద్యార్థులు పాల్గొనగా గెలుపొందిన 14 మందికి బహుమతులు అందజేశారు. ఎంజెపి స్కూలు విద్యార్థులు ప్రథమ బహుమతిని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (మెయిన్) విద్యార్థులు ద్వితీయ బహుమతి గెలుపొందగా, అమరావతి ప్రైవేటు పాఠశాల విద్యార్థులు తృతీయ బహుమతిని గెలుపొందారు.

మాడుగుల : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వీనస్ కోచింగ్ ఇనిస్టిట్యూట్‌లో మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించామని ఇనిస్టిట్యూట్ కరస్పాండెంట్, జిల్లా కార్యదర్శి తాళ్ళపురెడ్డి నాగచంద్ర తెలిపారు. మండల స్థాయి ప్రశ్న పత్రాలను శ్రీనాథ శ్రీనివాస్, సర్పంచ్ కవలతి, జిల్లా కార్యదర్శి తాళ్ళపురెడ్డి నాగచంద్ర, గొరిపట్టపు మహేష్ కుమార్, శ్రీనాధ కిరణ్, జాగని ఈశ్వరరావు, గొట్టపు చిన్నం నాయుడు, చల్లా ప్రకాష్, గ్రంధి సాయి, సవళ్ల జగదీశ్, ఆర్‌సిఎం స్కూల్ ఉపాధ్యాయురాలు ప్రశాంతి, చింతాడ సత్య, వరలక్ష్మి ఆవిష్కరించారు. మాడుగుల, చీడికాడ, బుచ్చయ్య పేట మండలాల నుంచి 200మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులు ఈనెల 23న జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులకు జెడ్‌పి బాలుర హైస్కూల్ హెచ్‌ఎం ముత్యాల నాయుడు మధ్యాహ్న భోజనం అందించారు.

పద్మనాభం : మండలంలోని పద్మనాభంలో ఉన్న గోస్తనీ విద్యాపీఠ్ హైస్కూల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మంగళవారం చెకుముకి మండల స్థాయి పోటీలు నిర్వహించారు. స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానం, కొవ్వాడ గ్రామానికి చెందిన సంస్కృతి స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం, పద్మనాభం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మూడో స్థానం సాధించారు. విజేతలకు స్థానిక ఎంఇఒలు రమణ, బాబులాలు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ధ్రువపత్రాలు అందించారు.

ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో మండలంలోని 10 పాఠశాలల నుండి 13 టీమ్‌లు పాల్గొన్నాయి. ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమం, సిర్లపాలెం పాఠశాల ద్వితీయం, గొట్టిపల్లి పాఠశాల తృతీయ స్థానాల్లో నిలిచాయి. వీరు ఈ నెల 23వ తేదీన జరిగే జిల్లా స్థాయి సైన్స్ పోటీలకు హాజరుకానున్నారు. ప్రధానోపాధ్యాయులు కె.కామేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక కన్వీనర్ పెద్దింటి త్రినాథరావు, కార్యదర్శి బి.ముత్యాలనాయుడు, పాల్గొని విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

మధురవాడ : జివిఎంసి 6వ వార్డు పరిధి పి.ఎం.పాలెంలోని సృజన పాఠశాలలో చెకుముఖి సైన్స్ సంబరాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 16 పాఠశాలలు నుండి 66 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ అధ్యక్షులు కృష్ణారావు మాట్లాడుతూ, గత 36 ఏళ్లుగా పిల్లలకు శాస్త్రీయ విజ్ఞానం పెంపొందిస్తున్నామని, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ విజ్ఞానం పట్ల మరింత అవగాహన కల్పించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ పోటీల్లో 8, 9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారని, ప్రతిభ కనబరిచిన 5 టీమ్‌లను (ప్రభుత్వ పాఠశాలల నుండి 2, ప్రైవేట్ పాఠశాల నుండి 3) ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మురళీధర్, జిల్లా సభ్యులు అప్పలరెడ్డి, నరసింహమూర్తి, కొండలరావు, లక్ష్మణరావు, మోహనరావు, సృజన స్కూల్ కరస్పాండెంట్ షరీఫ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలోని అడ్డరోడ్డు విశ్వశాంతి పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మండల స్థాయి చెకుముకి పోటీలు మంగళవారం నిర్వహించారు. చెకుముకి సైన్స్ సంబరాలలో ప్రశ్న పత్రాన్ని విశాఖ సైన్స్ అధికారి, కోరుప్రోలు హైస్కూల్ హెచ్‌ఎం కప్పల ప్రసాద్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ పోటీలలో 19 టీమ్స్ పాల్గొనగా అందులో ఉత్తమ ప్రతిభ చూపిన 4 టీమ్స్‌ను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. లింగరాజుపాలెం మహాత్మ జ్యోతిరావు పూలే ప్రభుత్వ పాఠశాల, పెద్ద ఉప్పలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీఆదర్శ హైస్కూల్, వినయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థుల జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. విజేతలు అనకాపల్లిలో ఈ నెల 23న జరుగు జిల్లా స్థాయి సైన్స్ సంబరాలకు తప్పనిసరిగా హాజరుకావాలని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కొలగాని వరప్రసాద్ కోరారు.

మునగపాక : మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. 12 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి కె.జశ్విత, ఏ జ్ఞానిత, ఎం నిహారిక, (శ్రీ ప్రగతి విద్యానికేతన్) కుందన, జే.హేమ, బి డాలి వర్షిత (ప్రణతి విద్యానికేతన్), డి.సుమశ్రీ, పి.గాయత్రి ఏ భావ్య శ్రీ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మునగపాక) ఎల్.హారిణి ఎం. ధనుష్, పి .పవన్ (జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల తోటాడ) విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్టు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రేబాక రవికుమార్, ఉపాధ్యాయులు కొణతాల రామచంద్రరావు, దాడి సుబ్రహ్మణ్యం, హేమంత్ పాల్గొన్నారు.

మద్యం, మాంసాహారం నిషేధం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని శైవ క్షేత్రమైన దారమఠం పరిసర ప్రాంతాలలో మద్యపానం, మాంసాహారం నిషేధించినట్లు స్థానిక ఎస్ఐ పి.రామారావు తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉన్న దారమఠం క్షేత్రం సమీపంలో అసాంఘిక కార్యక్రమాలకు ఆస్కారం లేకుండా ఈ మేరకు చర్యలు చేపట్టామన్నారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత క్షేత్రం పరిసరాల్లో తిరుగుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

ప్రజాశక్తి- చీడికాడ : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇప్పటినుంచే పార్టీ యంత్రాంగం సన్నద్ధం కావాలని జనసేన మండల అధ్యక్షుడు జివి.మూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, మండలంలో జనసేన పార్టీ బలంగా ఉన్న గ్రామాల్లో సీట్లు కేటాయించాలని కోరారు పార్టీ తరపున పోటీ చేయాలని సిద్ధంగా ఉన్నారన్నారు. పోటీచేసిన ప్రతిచోటా గెలుపే లక్ష్యంగా పక్కా కార్యాచరణతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు మజ్జి కృష్ణ, సూరిబాబు, గణేష్, శివ, కొండలరావు, విజయ్, రాజు, అచ్చంనాయుడు, రాము పాల్గొన్నారు.ఔ

నైపుణ్య ప్రదర్శన పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-గొలుగొండ : సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు చీడిగుమ్మల హైస్కూల్‌లో 9, 10వ తరగతి విద్యార్థులకు నైపుణ్య పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను హెచ్‌ఎం ఆనందరావు పరిశీలించి అభినందించారు. పోటీల్లో ఎంపికైన ప్రాజెక్టులను ఈ నెల 7న జిల్లా స్థాయికి పంపుతామని హెచ్‌ఎం ఆనందరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓ.సన్యాసిరావు, వి.గుణావతి, ఆర్.రమేష్, ఎన్.నిహారిక, ఎల్.దివ్య పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు


ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సత్యసాయి శతజయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. సత్యసాయి సేవా సంస్థల జోన్ ఇన్‌ఛార్జ్ ఎన్.విశ్వేశ్వరరావు, కార్యకర్తలు కొత్త భగవాన్, కక్కిరాల సురేష్ ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పెదబోదుగల్లం హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి అర్జంకి జగదీష్ ద్వితీయస్థానం సాధించి, హెచ్‌ఎంఎస్.జయశ్రీ నుంచి ప్రశంసాపత్రాలను అందుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎన్‌విఎస్.ఆచార్యులు, ఎస్.ఫాల్గుణరావు, ఎవిఎల్‌ఎన్.కుమారి, శ్రీదేవి, రమేష్‌బాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో కవగుంట గ్రామంలో సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు, కార్యదర్శి రాజబాబు ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ఇటీవల మొంథా ప్రభావంతో కురిసిన వర్షాలకు గ్రామంలో పారిశుధ్యం క్షీణించకుండా, దోమలు, క్రిమి కీటకాలు విజృంభించిప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా గ్రామమంతటా, సిమెంట్, మట్టి కాలువల్లోనూ, చిత్తడి తడి ప్రదేశాలలోనూ, చెత్తాచెదారంగా ఉన్న ప్రదేశాలలోనూ, బ్లీచింగ్ సున్నం చల్లి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే చర్యలు చేపట్టారు. ప్రజలు ఎటువంటి రోగాలు బారిన పడకుండా ఉండేందుకు పంచాయతీ పరంగా చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం ప్రభ పాల్గొన్నారు.

చర్చి నిర్వాహకునికి నోటీసులు

ప్రజాశక్తి -నర్సీపట్నం: మాకవరపాలెం మండలం పెద్దిపాలెం గ్రామంలో రెవెన్యూ భూమిని ఆక్రమించి చర్చి నిర్మాణం చేపట్టడంపై హైకోర్టు ఆదేశాల మేరకు చర్చి నిర్వాహకులకు నోటీసులు మంగళవారం రెవెన్యూ అధికారులు నోటీసులు అందజేశారు, మండలానికి చెందిన కొందరు దీనిపై హైకోర్టులో పిల్ వేయడంతో, కోర్టు ఆదేశాలతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. గ్రామ రెవెన్యూ అధికారి సూర్యకుమారి, రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.



నోటీసు ఇస్తున్న విఆర్‌ఒ, ఇతర రెవెన్యూ సిబ్బంది

పరిహారం, ప్యాకేజీ తేల్చకుండా

శంకుస్థాపన ఎలా చేస్తారు?

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు



మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు

ప్రజాశక్తి- నక్కపల్లి: వైజాగ్, చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ నిర్వాసితులను పూర్తిస్థాయిలో ఆదుకోకుండా ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ఈనెల 14,15తేదీలలో ఎలా శంకుస్థాపన చేస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్ ప్రశ్నించారు.

మంగళవారం మూలపర్రలో నిర్వాసితుల సమావేశంలో మాట్లాడుతూ వివాహితులైన ఆడపిల్లలతోపాటు అర్హులందరికీ ప్యాకేజీ ఇస్తామన్న హామీ నెరవేర్చాలని, మూలపర్ర, తమ్మల పేట, తమ్మయ్యపేట గ్రామాలలో ఇళ్లకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, నిర్వాసితులందరికీ ఆర్ కార్డులు ఇవ్వాలని, వెంటనే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మిట్టల్ కంపెనీకి భూములను కట్టబెట్టడంలో ఉన్న శ్రద్ధ, నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం, పునర్నిర్మాణం చేపట్టకుండా ఫ్యాక్టరీ పనులు చేపడితే ఒప్పుకోబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చంటమ్మ,భవానీ, కళావతి, లలితమ్మ, లక్ష్మీ, ముసలమ్మ,అమ్మాజీ,రమణ, అప్పారావు,సురేష్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-గొలుగొండ : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటల కొనుగోలు, అమ్మకాల కేంద్రాన్ని మంగళవారం గొలుగొండలో ఇన్‌చార్జ్ ఎంపిడిఒ శ్రీనివాసరావు ప్రారంభించినట్లు వెలుగు ఎపిఎం కరుణానిధి తెలిపారు. అమ్మపేట గ్రామానికి చెందిన రైతు .సత్యనారాయణ, కోఆపరేటివ్ బ్యాంకు మాజీ చైర్మన్ పెట్ల నారాయణమూర్తి పండించిన ఆరు రకాల బియ్యం, ఉలవలు, కొర్రలు, బొప్పాయి, సపోటా, జామ పంటలను కొనుగోలు కేంద్రంలో ప్రదర్శించారు.

కార్యక్రమంలో వెలుగు అధికారులు, గొలుగొండ గొర్రెలు, మేకలు రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు బొడ్డు రమణ, ఎఫ్‌పిఒ సిఇఒ వెంకటరమణ, అధ్యక్షుడు వరహాలు బాబు, చిన్నయ్యపాలెం నాయుడు పాల్గొన్నారు.

ఎంపిడిఒగా చైతన్య



బి.చైతన్య

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి ఎంపిడిఒగా బి.చైతన్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సబ్బవరం డిప్యూటీ ఎంపిడిఒగా పనిచేసిన చైతన్య, ప్రమోషన్‌పై నక్కపల్లి బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. మండల పరిషత్ ఎఒ డి సీతారామరాజు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంపిడిఒగా పనిచేసిన సీతారామరాజు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, నిరంతర పర్యవేక్షణతో విజయవంతంగా నిర్వహించి, మంచి గుర్తింపు పొందారు.

గెడ్డలు దాటేందుకు గుబులు

- అసంపూర్తి రోడ్లు, వంతెనలతో రాకపోకలకు అగచాట్లు!
- గిరిజనం కష్టాలు పట్టని ప్రభుత్వం



తాడు సహాయంతో గెడ్డను దాటుతున్న గిరిజనులు

ప్రజాశక్తి-మాడుగుల :మండలంలోని శంకరం పంచాయతీలో కొత్తవలస, తాడివలస, మామిడిపాలెం వద్ద గెడ్డలపై మూడు వంతెనల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు రోడ్లు కొట్టుకుపోయి అధ్వాన్నంగా తయారవ్వగా, గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని తాడివలస, గొప్పూరు, రాయిపాలెం, రాజంపేట, వెలగలపాడు, కొత్తవలస, మామిడిపాలెం.గిరిజన గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డల్లో తాడు సాయంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని దాటుతూ రాకపోకలు సాగిస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. వర్షం వస్తే గెడ్డలు దాటలేక గర్భిణులు, బాలింతలు, అనారోగ్యానికి గురైన వారిని డోలిలో మోసుకెళ్లక తప్పడం లేదని వాపోతున్నారు. ఇక విద్యార్థులకు పాఠశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు వెనకడుగు వేయాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. మహిళలు, వృద్ధులైతే సీజన్‌లో ఊరుదాటి వెళ్లడానికి భయపడుతున్నారు. గత సంవత్సరం గతేడాది కొత్తవలస వద్ద గెడ్డ దాటలేక, 108 వాహనం వచ్చే వీలులేక గిరిజన యువకుడు మృత్యువాత పడడం, తాడివలస గెడ్డదాటలేక గెడ్డలోనే గర్భిణి ప్రసవించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇక 108 104 వాహనాలు, ఇతర వాహనాలు ఆయాగ్రామాలకు వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు ఇప్పటికైనా అధికారులు నేతలు స్పందించి, తమ గ్రామాలకు రోడ్లు, వంతెన సౌకర్యాలను కల్పించాలని, అసంపూర్తి వంతెనలు పూర్తి చేయాలని కోరుతున్నారు. రహదారి సౌకర్యం లేని గిరిజన గ్రామం ఉండకూడదన్న డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఇచ్చిన మాటలను అమలు చేయాలని కోరుతున్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ మూడు బ్రిడ్జిల నిర్మాణానికి రూ.9.30కోట్లు మంజూరు చేయగా, కొంతవరకు పనులు చేపట్టి వదిలేశారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని రీఎస్టిమేట్ చేసి, రూ.11కోట్లతో పంపిన ప్రతిపాదనలు ఇంకా కార్యారూపం దాల్చలేదు. దీంతో గొట్టివాడ నుంచి కొత్తవలస, వెలగలపాడు, గొప్పుపూరు, తాడివలస మీదుగా రాయిపాలెం రాజంపేట మీదుగా కృష్ణపాలెం వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తే, అనేక గ్రామాలకు చెందిన వందలాది మంది గిరిజనులకు ప్రయోజనం చేకూరుతుందని అంటున్నారు.

బల్క్ డ్రగ్ పార్కు రద్దు చేసే వరకూ పోరాటం



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి : తమ జీవితాల్ని నాశనం చేసే బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటును రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేశారు. రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారుల తలపట్టిన శాంతియుత రిలే దీక్షలు మంగళవారం 52వ రోజుకు చేరాయి. ఈసందర్భంగా బల్క్ డ్రగ్‌తో తమ పొట్ట కొట్టొద్దని నినాదాలు చేశారు. సముద్రాన్ని కలుషితం చేసి ఉపాధికి గండి కొట్టొద్దని నినదించారు. హెటిరో కాలుష్యంతో ప్రాణాంతకరమైన వ్యాధుల బారిన పడి వైద్యం చేయించుకోలేక, చావుతో పోరాడుతున్నామని, ఇపుడు బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుతో తమను చంపేయొద్దని ఆవేదన వ్యక్తం చేశారు.. ప్రభుత్వం తమ మొరనాలించి, బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మత్స్యకార నాయకులు బి బాబ్జి, గోసల సోమేశ్వరరావు,సామ్యూల్, సోమేష్, కాశీ, కోదండ పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- వసతి గృహల్లో విద్యార్థుల రక్షణ, సంరక్షణకు అధిక ప్రాధాన్యత
- జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, డిఇఒ, ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో పదవతరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయం నుండి మంగళవారం గిరిజన, సాంఘిక సంక్షేమ, బిసి సంక్షేమ, కెజిబివి, విద్యాశాఖ అధికారులు, వసతిగృహాల సంక్షేమ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో వసతిగృహాలలో విద్యార్థుల హాజరు, పరీక్షల ముందస్తు ప్రణాళిక, మౌళిక సదుపాయాలు, విద్యాప్రమాణాల మెరుగు పరచుటకు తీసుకోవలసిన చర్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో వసతిగృహాలలో గల విద్యార్థులు అందరూ పరీక్షలలో ఉత్తీర్ణులు అయ్యేలా చదివించాలన్నారు. శతశాతం ఉత్తీర్ణత సాధించుటకు 100రోజులు యాక్షను ప్లాను అమలుచేయాలని సూచించారు. సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థులు వెంటనే వసతిగృహాలకు తీసుకురావాలని, అందుకు వసతిగృహ అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. పబ్లిక్ పరీక్షలు ముగిసేవరకు విద్యార్థులు అందరూ వసతి గృహలలోనే ఉండాలన్నారు. విద్యార్థుల రక్షణ, సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. బాలికల హాస్టళ్లలో సిబ్బంది తప్ప ఇతరులకు ప్రవేశం అనుమతించకూడదన్నారు. విద్యార్థులకు రక్షిత మంచినీరు, నాణ్యమైన భోజనం, నిరంతర వైద్యపరీక్షలు అందించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శద్ధ తీసుకొని సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శిక్షణ అందించాలని ఆదేశించారు. మోడల్ పేపర్లతో పరీక్షలు నిర్వహించాలన్నారు. వసతి గృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావునాయుడు, బిసి.వెల్ఫేర్ అధికారి కె.శ్రీదేవి, గిరిజన సంక్షేమ అధికారి జి. మంగవేణి, సాంఘిక సంక్షేమ అధికారి బి.రామనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు శిశు సంరక్షణ కేంద్రాలకు అనుమతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : నిబంధనలు ప్రకారం నిర్వహిస్తున్న శిశు సంరక్షణ కేంద్రాలకు మాత్రమే అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. జిల్లాలో పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల రిజిస్ట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి అనుమతులు మంజూరుకు జిల్లా కలెక్టరు అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. జిల్లా నందు పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్న సంస్థలు మొత్తం 43 ఉండగా వాటిలో మూడు ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్నాయని, ప్రభుత్వేతర సంస్థలు 40గా గుర్తించడం జరిగిందన్నారు. ఈ గుర్తించిన 43 సంస్థలను జిల్లా బాలల సంరక్షణ ఆధ్వర్యంలో జీవో నెంబర్ 9 ప్రకారం డిస్ట్రిక్ లెవెల్ ఇన్స్పెక్షన్ టీం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కమిటీ జిల్లాలో గల 43 సంస్థలను పర్యవేక్షించి ఆ సంస్థ స్థితిగతులను పరిశీలించి జిల్లా స్థాయి కమిటీలకు అందజేయడం జరిగిందన్నారు. దీనిని ఆధారంగా 35 సంస్థలకు నేరుగా రిజిస్ట్రేషన్ కొరకు రికమండ్ చేయడం జరిగినదని, నిబంధనలు ప్రకారం మౌళిక సదుపాయాలు లేని 7 సంస్థలను నోటీసులు జారీ చేయాలని, అందులో ఆశ్రయం పొందుతున్న చిన్నారులను దగ్గరలో గల ఇతర సంస్థలలో ఆశ్రయం కల్పించాలని కలెక్టర్ సూచించారు. జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి మాట్లాడుతూ సంరక్షణ కేంద్రాలలో గల చిన్నారులు ఏ పాఠశాలలో చదుతున్నారు వివరాలు సమగ్రంగా సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఎన్. సూర్యలక్ష్మి, కమిటీ కన్వీనర్, డిస్ట్రిక్ ప్రొబిషన్ ఆఫీసర్ వి.శ్రీధర్ అన్నాజీ, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం. రమేష్, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ఎంఆర్ఎల్.రాధా, అదనపు ఎస్‌పి దేవప్రసాద్, జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావు, మిషన్ కోఆర్డినేటర్ కె.మేరీ సువార్త పాల్గొన్నారు.

తహశీల్దారుకు ఘన సత్కారం

ప్రజాశక్తి -పాయకరావుపేట : మొంథా తుఫాను సమయంలో మండలంలోని సముద్రతీర ప్రాంత మత్స్యకారులు, ప్రజలకు ఉత్తమ సేవలు అందజేసినందుకుగానూ మండల తహశీల్దారు ఎస్‌వి మహేశ్వరావును ఇటీవల ముఖ్యమంత్రి, హోంమంత్రి అనిత సత్కరించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో మంగళవారం తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు మహేశ్వరరావును మండలంలోని విఆర్‌ఎలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం నాయకులు కడింపల్లి రాజు, శలగల రవి, నందిక నూకరాజు, గంటేడ సత్యనారాయణ, మోర్ల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.